ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.0
కనిష్ఠం 23.4
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 20 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	565.00 (244.1480)	67.800	1800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.40 (3.54)	243.51	299.63
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.573 (16.8784)	నిల్	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230

కాల్వల భూ సేకరణ వేగవంతం చేయాలి

» బీ.వెల్లెంల నల్లచెర్వును నీటితో నింపండి » అవసరమైతే మైనర్ కాల్వను తవ్వండి

» అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచన



బీ.వెల్లెంల రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కుడి,ఎడమ కాల్వల భూ సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. భూ సేకరణతో పాటే కాల్వల తవ్వకం పనులను చేపట్టి, ఆయకట్టు పరిధిలో సాగునీటిని అందించేందుకు దృష్టి సారించాలన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని తన స్వగ్రామం బ్రాహ్మణవెల్లెంలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం రిజర్వాయర్‌ను పరిశీలించారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ నీటిని పక్క మండలాల్లోని రైతులు కూడా మళ్లించుకుని చెర్వులను నింపుకుంటుంటే బీ.వెల్లెంలలోని నల్లచెర్వుకు నీరు చేరే మార్గం లేదంటూ గ్రామస్థులు తన వద్ద ఆవేదన వ్యక్తం చేశారని ప్రాజెక్టు అధికారులను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. వెంటనే నల్లచెర్వుకు నీటిని తరలించేలా డిస్ట్రిబ్యూటరీ నుంచి మైనర్ కాల్వ తవ్వాలని ఆదేశించారు. కుడి ఎడమ కాల్వల పరిధిలో ఇంకా ఎన్ని ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉందని ఈఈ శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి అడిగారు. సుమారు 9 ఎకరాల మేర భూ సేకరణ పూర్తిచేయాల్సి ఉందని చెప్పారు. కాల్వల భూ సేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసినందున ఎట్టిపరిస్థితుల్లో భూసేకరణ పూర్తిచేయాలని, ఏమైనా అవాంతరాలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా నాగార్జునసాగర్ నుంచి త్వరలో నల్లగొండ పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు నీటి చేరిక ఉంటుందని అదే సమయంలో బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్‌ను కూడా ఎఫ్ఆర్ఎల్‌కు చేర్చాలని ప్రాజెక్టు ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీఈఈలు విఠలేశ్వర్, పిచ్చయ్య, మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయ కలకలం


» సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన రాజగోపాల్‌రెడ్డి

» 'ఎక్స్'వేదికగా తన అభిప్రాయం స్పష్టం

» నిఖార్సయిన నాయకులు, కార్యకర్తలు సహించరని హెచ్చరిక

» తరుచూ కీలక ప్రకటనలతో రాజగోపాల్ సంచలనం

» అధిష్ఠానం మాట తప్పిందనే ఆవేదన



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో చేసిన ట్వీట్ రాజకీయ కలకలం రేపింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలను తప్పు బడుతూ ట్వీట్ చేయడం కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలను బహిర్గతం చేసినట్లయింది. గతంలోనూ రాజగోపాల్‌రెడ్డి మాజీ మంత్రి జానారెడ్డిపైనా ఇదేరీతిలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో జరిగే పార్టీ సభలకు, నల్లగొండ జిల్లాలో జరిగే జిల్లాస్థాయి అధికారిక కార్యక్రమాల్లో సైతం రాజగోపాల్‌రెడ్డి ఒకటిరెండు కార్యక్రమాల్లో మినహా మిగిలిన వాటికి గైర్హాజరవడం, నియోజకవర్గానికి మాత్రమే తన పర్యటనలను పరిమితం చేసుకోవడం ఆయన అసంతృప్తిని తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఎక్స్‌వేదికగా రాజగోపాల్‌రెడ్డి సీఎం ప్రసంగాన్ని నేరుగా ఖండించడం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోననే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.

తీవ్ర అసంతృప్తిలో రాజగోపాల్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంలో తనకు మంత్రి పదవి పక్కాగా వస్తుందనే ధీమాలో ఉన్న రాజగోపాల్‌రెడ్డికి ఇటీవలి విస్తరణలో సైతం అవకాశం దక్కకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు ఈ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోందనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. తనకు మంత్రిగా అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన మాట వాస్తవమని, అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానన్నప్పటికీ, దుర్మార్గంగా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారంటూ ఆయన గతంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార సందర్భంలో తీవ్రవ్యాఖ్యలు చేశారు. అదే వేదిక మీద మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేయడం అప్పట్లో సంచలనం కలిగించగా, ఆతర్వాత ఆ వ్యవహారం సద్దుమణిగింది. ఇటీవల సైతం ఆయన వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం తాను మంత్రిపదవి అడుగుతానని, తనకు మంత్రిగా బాధ్యతలిస్తే వెనకబడిన ప్రాంతాలకు అభివృద్ధి రుచి చూపిస్తానని రాజగోపాల్‌రెడ్డి తన ప్రసంగాల్లో పేర్కొంటున్నారు. సమర్థత గీటురాయిగా మంత్రిపదవులివ్వాలే తప్ప, కులం, మతం, జిల్లాలను అడ్డుగా చూపి సమర్థులకు అవకాశమివ్వకపోవడం సరికాదనే వాదన రాజగోపాల్‌రెడ్డి మద్దతుదారుల్లో వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా..

రాజగోపాల్‌రెడ్డి ఎక్స్ వేదికగా సీఎం ప్రసంగాన్ని తప్పుబడుతూ ఘాటుగానే స్పందించారు. కాంగ్రెస్‌లో సీఎం పదవికి ఎంపిక విధానం ఎలా ఉంటుందో వివరించారు. జాతీయపార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాలమేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌ని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరని ఎక్స్‌లో పేర్కొనడం ద్వారా తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఈ ట్వీట్ ద్వారా పార్టీలో అంతర్గత కుమ్ములాటల అంశం మరోసారి బహిర్గతమైంది. కాంగ్రెస్‌ని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాన్ని సహించబోమని పేర్కొనడం ద్వారా రాజగోపాల్‌రెడ్డి సీఎంకి నేరుగా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చర్చ సాగుతోంది.

లోక్‌సభ ఎన్నికల సమయంలో..

లోక్‌సభ ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలో ఒక్కో సీటుకు ఒక్కో మంత్రి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఎక్కడాలేని విధంగా భువనగిరిలోనే ఒక ఎమ్మెల్యేనైన తనకు ఇన్‌చార్జిగా బాధ్యతలిచ్చారంటే, తన సమర్థతపైనా, అభ్యర్థిని గెలిపిస్తాననే నమ్మకం ఉండ బట్టే ఇచ్చారని, ఆ ఎన్నికలో అన్ని నియోజకవర్గాలు తిరిగి అభ్యర్థిని గెలిపించడమే తన సమర్థతకు, పనితీరుకు నిదర్శనమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొంటున్నారు. మంత్రులు ఇన్‌చార్జిలుగా ఉన్న మహబూబ్‌నగర్, సికింద్రాబాద్...

మిగతా 7వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

కట్టంగూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కట్టంగూర్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కట్టంగూర్ మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో వచ్చే బుధవారం నాటికి కనీసం 50 శాతానికి తగ్గకుండా గ్రౌండింగ్ కావాలన్నారు. అదే విధంగా వనమహోత్సవం కింద సకాలంలో గుంతల తవ్వకం, మొక్కలు నాటడం వంటివి పూర్తిచేయాలన్నారు. ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాని గ్రామాల్లో వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో పురోగతి ప్రదర్శించని గ్రామాల పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆది, సోమవారాలు కూడా పనిచేసి పురోగతికి వచ్చేలా ప్రయత్నం చేయాలన్నారు. అదేవిధంగా ఏపీవోతో వనమహోత్సవంపై సమీక్ష చేశారు. కార్యక్రమం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గుంతల తవ్వకం, మొక్కలు నాటడం సకాలంలో పూర్తిచేయాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కనగల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై జీపీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాల వారీగా నిర్మాణం పనుల పురోగతిని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా ఇంకా ప్రారంభంకాకపోవటంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ పథకం అమలులో కార్యదర్శులు చూపుతున్న నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు చేపట్టకుండా అశ్రద్ధ చూపుతున్న వారి పేర్లతో జాబితాను తయారు చేసి నివేదిక అందజేయాలన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, ఏఈ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఆర్టిజన్లకు న్యాయం చేయాలి

» టీవీజేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు » ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వంటావార్పు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్

నల్లగొండ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల విద్యార్హతలను బట్టి న్యాయం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వెన్షన్ జేఏసీ (టీవీఏసీ జేఏసీ) రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీవీఏసీ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయ ఆవరణలో వంటా వార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయడం వల్ల విద్యుత్ సంస్థలపై పెద్దగా భారం పడదన్నారు. ఆర్టిజన్స్ విషయంలో గత పాలకు చేసిన తప్పులు ప్రస్తుత పాలకులు చేయకుండా కన్వర్షన్ ఇచ్చి వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, గృహజ్యోతి వంటి పథకాల అమలులో కార్మికుల దే కీలకపాత్ర అని అన్నారు. అందుకే విద్యార్హతలను బట్టి చదువుకు తగ్గ పోస్టులు ఇవ్వాలన్నారు కన్వర్షన్ సాదించేందుకు విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్లందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వారు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ వెన్నమల్ల నరేందర్, శ్రీపతి రమేష్, కో కన్వీనర్ సలీంపాష, జాయింట్ సెక్రటరి మురళి పెరుమాళ్ల, జిల్లా కన్వీనర్ పెరక శేఖర్, యాదాద్రి జిల్లా కన్వీనర్ అహ్మద్‌పాష, సూర్యాపేట జిల్లా కన్వీనర్ మేడి యాదయ్య, జిల్లా నాయకులు విజయ్‌కుమార్, జిట్టిపల్లి లింగస్వామి, బొప్పని యాదయ్య, లక్ష్మీనారాయణ, సత్తిరెడ్డి , కాశీరాం పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి

ఎస్పీ శరత్ చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన నిందితులకు శిక్ష పడే పడే విధంగా కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్‌లకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేసులో నిందితులను దోషులుగా నిరూపించి, శిక్షలు పడేలా పని చేయాలన్నారు. కోర్టు అధికారులు, ప్రాసిక్యూటర్ల సమన్వయంతో న్యాయ సలహాలు అడిగి పని చేయాలన్నారు.కేసు తుది దశలో సాక్ష్యులు, నిందితులు, బాధితులను సమయానికి కోర్టులో హాజరుపరిచేలా చూసుకోవాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడేలా పనిచేయడంలో సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారితోపాటు కోర్టు డ్యూటీ సిబ్బందికి చాలా బాధ్యత ఉంటుందన్నారు. కోర్టుకేసుల్లో నిందితులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, తద్వారా ప్రజలకు పోలీస్‌శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ సంవత్సర కాలంలో జిల్లావ్యాప్తంగా ఒకరికి ఉరిశిక్ష పడగా, 10మందికి జీవిత ఖైదు, వివిధ కేసుల్లో మొత్తం 75మందికి శిక్షలు విధించారన్నారు. ఈసందర్భంగా ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, అఖిల, జవహర్‌లాల్, రంజిత్ కుమార్, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐవెంకట్ రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

● జడ్పీసీఈవో శ్రీనివాసరావు



సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీసీఈవో శ్రీనివాస రావు

మునుగోడు రూరల్, మునుగోడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించి, లక్ష్యాన్ని పూర్తి చేయాలని జడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, ఇతర ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో పలు అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించి సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు అన్నీ వీలయినంత త్వరగా గ్రౌండింగ్ చేయించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో విజయ భాస్కర్, మహ్మద్ అథర్ పర్వేజ్, నాగరాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇక ఆస్తి రికార్డులు పదిలం

» మునిసిపాలిటీల్లోని ఆస్తులపై సమగ్ర సర్వే

గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సాధికారత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో ఆస్తులను డ్రోన్ల ద్వారా సర్వే, మ్యాపింగ్ చేసి యాజమాన్య హక్కులు, ప్రజలకు ఆస్తి(ప్రాపర్టీ) కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం కేంద్ర సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్‌డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వామిత్వ) పథకాన్ని ప్రవేశపెట్టింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్ పట్టణంలోనే సర్వే జరిగింది. ఈ నగరంలో ఏ ఆస్తి ఎవరిది అన్న రికార్డులు పక్కాగా ఉన్నాయి. అయితే మిగతా అన్ని జిల్లాల్లో పల్లెలు, పట్టణాల్లో సర్వే చేపట్టలేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గతంలో ఇళ్ల స్థలాలన్నీ చాలావరకు గ్రామ కంఠంగా నమోదు చేశారు. దీంతో ఇల్లు నిర్మించుకున్నా రికార్డుల్లో మాత్రం అవే వివరాలు లభ్యమవుతాయి. దీంతో ఇళ్ల విక్రయించాలనుకున్నా... కొనుగోలు చేయాలన్నా సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలనే కేంద్రం అడుగులు వేస్తోంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తోన్న స్వామిత్వ పథకం రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండ గా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట మునిసిపాలిటీ, మిర్యాలగూడ మునిసిపాలిటీలోని రెవెన్యూ గ్రామాల్లో ఈ సర్వేను చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు పైలట్ ప్రాజెక్టు కింద యాదగిరిగుట్ట, మిర్యాలగూడ మునిసిపాలిటీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. యాదగిరిగుట్టలో 12 వార్డుల్లో దాదాపు 15 వేల నుంచి 18వేల జనాభా ఉండగా, మిర్యాలగూడ మునిసిపాలిటీలో 48 వార్డుల్లో దాదాపు 1,09,891 జనాభా ఉంది. ఇప్పటికే ఈ మునిసిపాలిటీల పరిధిలో స్వామిత్వ పథకం కింద డ్రోన్ సర్వే పనులు చకచక కొనసాగుతున్నాయి. సంస్కరణల్లో భాగంగా ఇళ్లతోపాటు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ ఆస్తులపై పూర్తిస్థాయి మ్యాప్‌లను తీయించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

సామాజిక, ఆర్థిక ప్రమాణాల మెరుగుదల

మునిసిపాలిటీల పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూమిని మొత్తాన్ని ప్రత్యేకంగా మ్యాప్‌గా రూపొందిస్తారు. తద్వారా ఇంటి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్యకార్డులు (ఆస్తి కార్డులు, టైటిల్ డీడ్‌లను జారీచేయడంతో గ్రామీణ నివాసిత(అబాది))ప్రాంతాల్లో ఆస్తిపై స్పష్టమైన యాజమాన్యాన్ని కల్పించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది.

రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



నల్లగొండలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మునిసిపల్ మాజీ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్/తిప్పర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన నల్లగొండ ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డూ మంజూరు చేయలేదని, అలాంటిది తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇస్తోందని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్ట మొదటిసారిగా సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పరుశురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో 39 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పరశురామ్, నాయకులు నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, రైతు సంఘం నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, బద్దం సుధీర్, పల్లపు వెంకన్న పాల్గొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం రూ.3500కోట్ల

టర్నోవర్ లక్ష్యం

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ.3500కోట్ల టర్నోవర్ చేరుకోవడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో రూ.50కోట్లు పంటరుణాలు ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక రుణాలను త్వరితగతిన ఇవ్వాలన్నారు. ఈ సంవత్సరంలో నాబార్డుతో బెస్ట్ పర్ఫామెన్స్‌గా నల్లగొండ డీసీసీబీ ఎన్నిక కావడానికి సహకరించిన పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు గొంగిడి మహేందర్ రెడ్డి, గుడిపాటి సైదులు, పాశం సంపత్‌రెడ్డి, దనావత్ జయరాం, కోడి సుష్మ, కె.లింగం యాదవ్, పల్లా ప్రవీణ్ రెడ్డి, రంగాచారి, అంజయ్య, శ్రీనివాస్, సైదయ్య, జె.శ్రీనివాస్, వీరస్వామి, అరుణ, రామచంద్రయ్య, గిరిధర్, శ్రవణ్, డీసీవో పత్యానాయక్, నాబార్డు డీడీఎం వినయ్ కుమార్, డీసీసీబీ సీఈవో ఆర్.శంకర్‌రావు, జీఎం నర్మద పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్కలు నాటాలి

కేతేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): అమ్మ పేరిట ప్రతిఒక్కరూ ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని కిసాన్ మోర్చా జాతీయనేత గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల మోదీ పాలన పూర్తయిన సందర్భంగా వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. 11 ఏళ్లలో అనేక రంగాల్లో పురోగతిని సాధించి ప్రపంచంలోని అగ్రదేశాల సరసన భారత్ నిలిచిందన్నారు. దేశ ప్రతిష్ఠ విశ్వవిఖ్యాతికి ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎంఏ సత్తార్, పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు ఎ.అనితాగౌడ్, చినేని జానయ్య, సాయన్న, వేణుగోపాల్‌రెడ్డి, టినర్సింహాచారి, ఎస్.సంధ్య, అఖిల్ పాల్గొన్నారు.

మాఊరి షాపింగ్ మాల్

▸ వారానికి ఒకసారి సాగే సంతలు
▸ చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో సందడి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికీ వారం తాపు సంతలు కొనసాగుతున్నాయి. తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను రైతులు సంతలకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వీటితో పాటు చిరు వ్యాపారులు పండ్లు, వస్త్రాలు, చెప్పులు, వ్యవసాయ పరికరాలు విక్రయిస్తుంటారు. సామాన్లు, తినుబండారాల రూపంలో సంతలు చిరువ్యాపారులకు, ప్రజలకు వారధిగా ఉంటున్నాయి. పశువులు, మేకల క్రయ విక్రయాల కోసం సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు వస్తుంటారు. వారానికి ఒక రోజు ఒకసారి జరిగే సంతలతో సందడి ఉంటుంది.





తిరుమలగిరిలో కొనసాగుతున్న వారాంతపు సంత(ఫైల్)

40 సంవత్సరాలుగా మల్లేపల్లి పశువుల సంత

కొండమల్లేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీలో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తారు. సుమారు 40ఏళ్లు ఇక్కడ వారంతపు సంత కొనసాగుతోంది. నాలుగురోడ్ల కూడలి కావడంతో రద్దీగా ఉంటుంది. దేవరకొండ, నాంపల్లి, చింతపల్లి, పీఏపల్లి, గుర్రంపోడు, చందంపేట, రంగారెడ్డి జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా వివిధ దూర ప్రాంతాల నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి ఆదివారం రోజు పశువుల సంతకు క్రయ, విక్రయదారులు వస్తుంటారు. అక్కడ అన్ని రకాల కూరగాయలు, కావాల్సిన నిత్యావసర వస్తువులు, పండ్లు, మాంసం వ్యవసాయ రంగానికి సంబంధించిన రైతులకు ఉపయోగపడే అన్నిరకాల వస్తువులు విక్రయిస్తారు. వారాంతపు సంతకు సుమారు 20వేల జనాభా వరకు వచ్చి వెళ్తుంటారు. సంతలో దాదాపు లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. సంతలో 50నుంచి 70మంది గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది పనిచేస్తారు. ఇంత వ్యాపారం జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్లాస్టిక్ నిషేధం అమల్లో లేక పోవడంతో ప్లాస్టిక్‌ను యథేచ్ఛగా వాడుతున్నారు.

తిరుమలగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీలో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తారు. 60ఏళ్లుగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సంత ఉపయోగపడుతుంది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, వస్త్రాలు, వట్టిచేపలు, చెప్పులు, వ్యవసాయ పనిముట్లు, వంట సామాన్లు, తినుబండారాలు లభిస్తాయి. పట్టణాల్లో, గ్రామాల్లో ఎన్ని రకాల కిరాణ షాపులు, మార్ట్‌లు ఉన్నా కూరగాయల షాపులు ఉన్నా తిరుమలగిరిలో బుధవారం జరిగే సంతకు వచ్చి వారానికి సరిపడా కూరగాయలు, వస్తువులు తీసుకెళ్తారు. తిరుమలగిరి మండలం, నాగారం అర్వపల్లి, పక్క జిల్లాలైన జనగాం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, మండాలలు, దేవర్పుల, మొండ్రాయి, కొడకండ్ల, పెద్దవంగర, అడ్డగూడూరు మండలాల్లో గిరిజన తండాలు ఎక్కువ.

పశువులకు, మేకలకోసం సుదూర ప్రాంతాల నుంచి..

తిరుమలగిరి మార్కెట్‌కు అన్ని రకాల పశువులు వస్తుంటాయి. రైతులు తమ వ్యవసాయ పనులకోసం ఎద్దులు, సాకడానికి బర్రెల కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తారు. పండుగలు, శుభకార్యాలకోసం సంతలో పొట్టేళ్లు, మేకలకోసం వస్తుంటారు. తమకు నచ్చిన, ఆమోదమైన ధరకు లభిస్తాయని రైతులు చెబుతుంటారు. తిరుమలగిరిలో నిర్వహించే సంత ప్రతి బుధవారం బతుకమ్మ పండుగలా కనిపిస్తుంది. చిరువ్యాపారులు, ప్రజలతో కలిసి సుమారు 10వేల మంది వస్తుంటారు. మహిళలు కుటుంబసభ్యులతో కలిసి సంతలో కూరగాయలు, పండ్లు కొనుక్కునే వెళ్లేటప్పుడు ఎంతో కోలాహలంగా ఉంటుంది.

30 ఏళ్లుగా సంతలో కూరగాయలు విక్రయిస్తున్నా



తిరుమలగిరి సంతలో 30 ఏళ్లుగా కూరగాయలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నాను. చుట్టుపక్కల సంతల కన్నా, తిరుమలగిరిలో వ్యాపారం ఎక్కువగా సాగుతుంది.

- వేముల లక్ష్మి, కూరగాయల వ్యాపారి తిరుమలగిరి

తాజా కూరగాయలు దొరుకుతాయి



తిరుమలగిరి సంతలో తాజా కూరగాయలు, దొరుకుతాయి. కొన్నేళ్లుగా ప్రతి బుధవారం తప్పకుండా సంతలో రకరకాల కూరగాయలు వారానికి సరిపడా కొనుక్కుంటాం

- బనువరి నర్సయ్య, రిటైర్డ్ ఉద్యోగి

20 సంవత్సరాలుగా కుండలు అమ్ముతున్నా

నేను కొండమల్లేపల్లిలో దాదాపుగా 20 సంవత్సరాలుగా ప్రతి ఆదివారం జరిగే సంతలో కుండలు అమ్ముతాను. వారంలో ఒకే రోజు సంత కావడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కుండలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అలాగే నిత్యం రద్దీగా ఉంటుంది. కుండల వ్యాపారం బాగా నడుస్తుంది.

- ఘనపురం అంజయ్య, గుడిపల్లి గ్రామం

చౌటుప్పల్ అంగడిలో సందడి

చౌటుప్పల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలకేంద్రంలో ప్రతి ఆదివారం సంతకు సంత నిర్వహిస్తారు. 50 సంవత్సరాలుగా ఈ అంగడి జరుగుతుంది. గతంలో పశువుల సంతకు ఈ అంగడి పేరుగాంచింది. ప్రస్తుతం కూరగాయలు, పాత వస్త్రాలు, నిత్యావసర వస్తువులు లభిస్తాయి. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఎక్కువగా రైతులే అంగడిలో కనిపించేవారు. పశువులు మేకల వ్యాపారం సాగించేవారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో చౌటుప్పల్ పట్టణం గణనీయంగా విస్తరించింది. చౌటుప్పల్ మండల కేంద్రం ఈ పరిసరాల్లో ఎక్కువగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అంగడి పరిసర ప్రాంతాలు, సర్వీసు రోడ్డు ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడతాయి. ఇక్కడ జరిగే పాత వస్త్రాల వ్యాపారం ఎంతో ప్రసిద్ధి చెందింది. దినసరి కూలీలు, కార్మికులు ఎక్కువగా పాత వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి పాత వస్త్రాల వ్యాపారం పాముఖ్యతపై పాఠ్య పుస్తకాల్లో సైతం ప్రచురించారు. సంత రోజున పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు తాము పండించిన పంటలను విక్రయిస్తుంటారు. సంతలో ప్లాస్టిక్ నిషేధం అమలైన దాఖలాలు కనిపించడం లేదు. క్రయవిక్రయాలు నిర్వహించడానికి ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



లింగయ్య(ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు రేషన్ డీలర్ కూడా అయిన గూడ లింగయ్య(102) శనివారం మృతిచెందాడు. కొంతకాలంగా లింగయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఆయన సీనియర్ డీలర్‌గా స్థానిక డీలర్లు చెబుతున్నారు. లింగయ్యకు భార్య మల్లమ్మ, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. లింగయ్య మృతిపట్ల మండల రేషన్ డీలర్లు సంతాపం తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



లింగయ్య(ఫైల్)

పాలకవీడు, జూలై19: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని కోమటికుంట గ్రామంలో గురువారం రాత్రి ఊర చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. ఎస్ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటికుంట గ్రామానికి చెందిన రాతికింద చిన లింగయ్య(57) గురువారం రాత్రి ట్యూబ్ సాయంతో ఊర చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. రెస్క్యూటీం, పాలకవీడు పోలీసు సిబ్బంది పడవల సాయంతో వెతకగా శనివారం ఉదయం లింగయ్య మృతదేహం లభించింది. లింగయ్య భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీ వాచ్‌ఉమన్ ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న బాధితురాలు అరుణ

అడవిదేవులపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మండలకేంద్రంలోని కేజీబీవీలో వాచ్‌ఉమన్‌గా పనిచేస్తున్న అరుణ శనివారం పాఠశాలలో ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామానికి చెందిన అరుణ తొమ్మిది సంవత్సరాలుగా కేజీబీవీలో పనిచేస్తోంది. శనివారం ఆలస్యంగా వచ్చిన అరుణను ఎందుకు ఆలస్యంగా వచ్చావని ఎస్‌వో అడిగారు. తాను కేవలం ఐదు నిమిషాలు మాత్రమే ఆలస్యంగా వచ్చానని, దీనికే నిలదీస్తారా అని అనడంతోపాటు మీరు పనివాళ్ల మధ్య గొడవలు సృష్టించి ఒకరినొకరు కొట్టుకునేలా చేస్తున్నారని, దీంతో తాము చచ్చే పరిస్థితి వచ్చిందని అనడంతో, అయితే చావు అని ఎస్‌వో నాగలక్ష్మి అనడంతో అరుణ దగ్గరల్లో ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకునేందు యత్నించడంతో సిబ్బంది అడ్డుకున్నారు. అయినా అరుణ ఆగకుండా ఓ విద్యార్థిని చున్నీ తీసుకొని మెడకు గట్టి బిగించుకోబోగా, సిబ్బంది వారించారు. అరుణను స్థానిక గ్రామీణ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. ఈ సందర్భంగా బాధితురాలు అరుణ మాట్లాడుతూ ఎస్‌వో వేధింపులు భరించలేకపోతున్నామని, నిత్యం తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించింది. ఎస్‌వో నాగలక్ష్మిని వివరణ కోరగా తాను నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నానని, పాఠశాల మెనూ విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని చెబితే, సిబ్బందిలో కొందరు తనను ఇబ్బందులకు గురిచేసేందుకు తాను అనని మాటలను అన్నట్లుగా చెప్పి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు విడుదల చేయాలి

చిట్యాలరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా వేతనాలు రాక కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి చేకూరి మల్లేష్ కోరారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు చిట్యాల ఎంపీడీవో ఎస్‌పీ జయలక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న తాము పథకంలో కీలకంగా ఉంటూ పనులు చేయిస్తున్నామని, ఎంత చేసినా తమ పరిస్థితులు మారడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మర్రి రమేష్, జోగు లింగస్వామి, నూనె శివ, వీరమల్ల ఉషారాణి, వడ్డగాని రాధ, స్వప్న, చాంద్‌పాషా, మంజుల, అనిత, వరలక్ష్మి, శోభారాణి తదితరులు ఉన్నారు.

అడవి జంతువు సంచారం?

భువనగిరి రూరల్, జూలై 19(ఆంధ్ర జ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రెడ్డినాయక్‌తండా, పచ్చ ర్లబోడుతండా, మూసీ పరీవాహక ప్రాంతాల్లో అడవి జంతువు సంచరిస్తోందని పుకార్లు వస్తు న్నాయి. జిల్లా ఫారెస్టు అధికారి పద్మ జారాణి ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ శ్రీను, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్ శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. గ్రామ సమీపంలోని వ్యవ సాయ పొలాల వద్ద అడవి జంతువు కంటపడిందని, ఈ క్రమంలో కుక్కలపై దాడిచేసి సమీపంలోని గుట్టలపైకి పారిపోయిందని స్థానిక రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్టు అధికారులు అప్రమత్తమై అడవి జంతువు సంచరిస్తోందన్న ప్రాంతాల్లో పాదాల ముద్రల కోసం వెతికారు. చుట్టు పక్కల ఎలాంటి ఆనవాళ్లు లేవని ప్రాథమికంగా అంచనా వేశారు. రాత్రి వేళల్లో రైతులు ఒంటరిగా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లొద్దని తెలిపారు. గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఎస్ఐల బదిలీలు

నల్లగొండక్రైం, సూర్యాపేట జూలై 19(ఆంధ్ర జ్యోతి): నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పలువురు ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఆయా జిల్లాల ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, కొత్తపల్లి నర్సింహ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నల్లగొండ జిల్లాలో

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
కే రాజీవ్‌రెడ్డి	నల్లగొండ	కనగల్
పీ విష్ణుమూర్తి	కనగల్	సీసీఎస్
ఎం సంజీవరెడ్డి	నల్లగొండ	వీఆర్ గట్టుప్పల్ అటాచ్
జీ వెంకట్‌రెడ్డి	గట్టుప్పల్	సీసీఎస్
సీహెచ్ బాలకృష్ణ	వీఆర్	డిండి
బీ రాజు	డిండి	డీఐజీఆఫీసులో రిపోర్ట్
నాగేంద్రబాబు	నల్లగొండ	నేరేడుగొమ్ము

సూర్యాపేట జిల్లాలో

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
శివతేజ	వీఆర్	సూర్యాపేట-2
ఆంజనేయులు	సూర్యాపేట-2	వీఆర్
సీహెచ్ గోపాల్‌రెడ్డి	వీఆర్	కోదాడరూరల్
అనిల్‌రెడ్డిని	కోదాడరూరల్	వీఆర్
సురేష్‌రెడ్డి	వీఆర్	చిలుకూరు
రాంబాబు	చిలుకూరు	వీఆర్
అజయ్‌కుమార్	వీఆర్	మోతె
యాదవేంద్రరెడ్డి	మోతె	వీఆర్

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



హరిసింగ్ (ఫైల్)

మఠంపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని అవిరెని కుంటతండాలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అవిరెనికుంటతండాకు చెందిన బానోతు హరిసింగ్ (46) తనకు ఉన్న ఎకరం వ్యవసాయ పొలంలో నారుమడి వేశాడు. నారుమడిలో ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లిన హరిసింగ్ మోటరుకు విద్యుత్ సరఫరా రాకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఏబీస్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హరిసింగ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చిట్యాలరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్‌లోని డీఈసీ కంపెనీలో శుక్రవారం సాయంత్రం జరిగింది. చిట్యాల ఎస్ఐ ఎం. రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఏపూర్ శివారులో గల డీఈసీ కంపెనీలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజిత్ బన్సాల్(30)రెండేళ్ల క్రితం కూలీ పని కోసం వచ్చాడు. భార్య, పిల్లలతో కలిసి కంపెనీకి సంబంధించిన క్వార్టర్స్‌లోనే నివాసముంటున్నాడు. శుక్రవారం తాను ఉంటున్న గది వద్ద ఉండే షెడ్ పక్కవైపు నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా అదే సమయంలో వర్షం వస్తుండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బన్సాల్ భార్య రాధా శనివారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బన్సాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లిని తీసుకెళ్లేందుకు నిరాకరించిన కుమారులు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధాశ్రమ నిర్వాహకులు ● నల్లగొండ జిల్లాలో నార్కట్‌పల్లి మండలంలో ఘటన



ధనమ్మ (ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో చేర్పించిన తల్లి మతి స్థిమితంలేకుండా ప్రవర్తిస్తోందని ఆశ్రమ నిర్వాహకులు కుమారులకు తెలిపారు. వారు తల్లిని తమ వెంట తీసుకెళ్లేందుకు నిరాకరించడంతో ఆశ్రమ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో శనివారం జరిగింది. కట్టంగూర్‌కు చెందిన వృద్ధురాలు(సుమారు 80 సంవత్సరాలు) ఇల్లెందుల ధనమ్మను ఆమె ముగ్గురు కుమారులు, కూతురు కలిసి నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం బస్‌స్టేజీ సమీపంలోని శ్రీవాసవీ వృద్ధాశ్రమంలో 2024 డిసెంబరు 19వ తేదీన చేర్పించారు. అప్పటి నుంచి ఆమె ఈ వృద్ధాశ్రమంలోనే ఉంటోంది. కొన్ని రోజులుగా ధనమ్మ మతి మరుపు వచ్చినట్లుగా ప్రవర్తిస్తోంది. వారం రోజుల క్రితం కుర్చీ ఎక్కి భవనంపై నుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించింది. గమనించిన ఆశ్రమ నిర్వాహకులు వెంటనే ఆమెను గదిలోకి తీసుకెళ్లారు. ధనమ్మ ప్రవర్తనను వృద్ధాశ్రమ నిర్వాహకులు రంగ శేఖర్, మీల సోమయ్య ఆమె కుమారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి నుంచి సరైన స్పందన రాలేదు. కాగా శుక్రవారం గదిలో టవల్‌ను మెడకు చుట్టుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో ఆశ్రమ ఉద్యోగి ఆమెను వారించాడు. పరిస్థితిని నిర్వాహకులు చెప్పడంతో వారు వచ్చి ఆమెను కారులో ఎక్కించుకుని కట్టంగూరులోని రెండో కుమారుడి వద్దకు తీసుకెళ్లారు. కానీ తల్లిని ఇంట్లోకి రానివ్వకపోవడంతో చేసేది లేక వృద్ధాశ్రమ నిర్వాహకులు నార్కట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ధనమ్మ ప్రవర్తనను కుమారుల వైఖరిని వివరించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ సూచన మేరకు మేరకు ధనమ్మను తిరిగి వృద్ధాశ్రమానికి తీసుకెళ్లిన నిర్వాహకులు ప్రస్తుతం ఆమెకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు. ఎస్ఐ స్వయంగా వెళ్లి ధనమ్మతో మాట్లాడారు. కుమారులను పిలిపించి మాట్లాడుతానని మంచిగా ఉండాలని సూచించారు. తల్లిని ఆదివారం ఇంటికి తీసుకెళ్తానని కుమారుడు వృద్ధాశ్రమ నిర్వాహకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు.

నాగులపాటిఅన్నారంలో భయం.. భయం

● వరుస మరణాలతో హడలెత్తుతున్న గ్రామస్థులు



పెన్‌పహాడ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని నాగులపాటి అన్నారంలో నెలరోజులుగా వరుస మరణాలు గ్రామస్థులను భయపెడుతున్నాయి. దీంతో వారు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. 60సంవత్సరాల పైబడిన నలుగురు అనారోగ్యంతో మృత్యువాతపడ్డారు. 48 సంవత్సరాల లోపు వయస్సున ఐదుగురు ఆకస్మాత్తుగా చనిపోయారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ఏ సమయంలో ఎవరు మృత్యువాత పడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. 60ఏళ్లు దాటిన రామినేని సావిత్రమ్మ, దొంతగాని కృష్ణయ్య, మీసాల అంజమ్మ, కల్లంచెర్వు దేవమ్మ అనారోగ్యంతో మృతిచెందారు.

వేర్వేరు కారణాలతో యువకులు..

గ్రామానికి చెందిన నక్కశివ ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడి తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. పర్సబోయిన సైదులు అలియాస్ చంద్రబాబునాయుడు చెరువులోకి వెళ్లి చేపలు పడుతుండగా ప్రమాదశాత్తు మృతిచెందాడు. గర్నెబాలయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగానే గుండెపోటుతో మరణించాడు. దొంతగాని నాగయ్య తన పొలం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మోటర్ వేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు.

సాక్షులను బెదిరించిన నిందితుడికి రిమాండ్

చింతలపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో సాక్షులను బెది రించిన నిందితుడిని, అతడి సోదరులను శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం రేబల్లె గ్రామానికి చెందిన కొమరబోయిన పవన్‌పై 2022వ సంవత్సరంలో పోక్సో కేసులో అరెస్టయ్యాడు. అనంతరం కొద్దిరోజులకే కోర్టు బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే కేసు ప్రస్తుతం తుదిదశకు వస్తుండడంతో నిందితుడి సోదరులు కొమరబోయిన రాజు, కొమరబోయిన సాయి కేసు ఫిర్యాదుదారులు, సాక్షులను, సాక్ష్యం చెప్పవద్దని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఫిర్యాదుదారుడు చింతలపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఎస్ఐ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్‌హెచ్-167 విస్తరణకు గ్రీన్‌సిగ్నల్


● నాలుగు లేన్లుగా దేవరకొండ- కోదాడ రహదారి ● 219 కిలోమీటర్లు.. 2028 కల్లా పూర్తి చేయాలని లక్ష్యం



జడ్చర్ల - దేవరకొండ జాతీయ రహదారి

దేవరకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-167 విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో జడ్చర్ల నుంచి దేవరకొండ మీదుగా కోదాడ వరకు రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న రహదారి జడ్చర్ల, కల్వకుర్తి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హలియా, మిర్యాలగూడ మీదుగా కోదాడ వరకు 219 కిలోమీటర్లు నాలుగు వరుసల రోడ్డు నిర్మించనున్నారు. 2028కల్లా రహదారి పూర్తి చేయడమే లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రోడ్డు విస్తరణతో దుకాణ సముదాయాలు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రహదారి విస్తరణపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రావాల్సి ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. మరోసారి దేవరకొండ, కొండమల్లేపల్లిలో రోడ్డు విస్తరణ అవుతుండడంతో ట్రాఫిక్ సమస్యకు కూడా పరిష్కారం లభించనుంది. రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశముంది.

రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి



జడ్చర్ల, కోదాడ, వయా దేవరకొండ మీ దుగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లైన్ల రోడ్డు మంజూరు చేయడం హర్షణీయం. రోడ్డు విస్తరణతో రవాణా వ్యవస్థ పెరుగుతుంది. రహదారి నిర్మా ణంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది.

● వస్కుల సుధాకర్, దేవరకొండ.

పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించాలి



నల్లగొండ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బైపాస్ విస్తరణలో సర్వే చేయించి భూములు కోల్పోయే వారికి నష్టపరిహారం ఇచ్చాకే రోడ్డు పనులు ప్రారంభించాలని భూనిర్వాసితుల పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు సయ్యద్ హాషం, కో కన్వీనర్లు నాగార్జునరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణం గిరకబాయిగూడెంలోని జాతీయ రహదారి కాంట్రాక్టర్ క్యాంప్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో 14కిలోమీటర్ల విస్తరణలో 1250 మంది నిర్వాసితులు ఉన్నారని గుర్తించామని తెలిపారు. మంత్రులు కలగజేసుకొని వారందరికీ నష్టపరిహారం అందించేలా చూడాలన్నారు. అప్పటి వరకు రోడ్డు నిలిపి వేయాలన్నారు డిమాండ్ చేశారు. బాధితులు విలువైన భూములు కోల్పోతారని తెలిపారు. ఆ భూముల్లో పంటలు కూడా వేశారని వాటికి కూడా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యాలయ మేనేజర్ సత్యం మాట్లాడుతూ రైతులందరికీ నష్టపరిహారం చెల్లించిన తర్వాత, రైతుల అనుమతితోనే రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. అంతవరకు ఏ రైతు భూమిలో కూడా రోడ్డు వేయబోమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ గౌరవ సలహాదారుడు దండెంపల్లి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ ఊట్కూరి వెంకటిరెడ్డి, కోశాధికారి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రలు గాడి తప్పాయి : చిరుమర్తి



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నల్లగొండ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్రపవార్‌ను శనివారం కలిశారు. నకిరేకల్ నియోజకవర్గంలో జరుగుతున్న ఆగడాల గురించి వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లు ప్రశాంతంగా ఉన్న నకిరేకల్ నియోజకవర్గంలో కొందరు కావాలని అలజడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ వారు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా పనిచేసిన వ్యక్తికే మంజూరు చేయడం పట్ల నకిరేకల్ మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్త మనోహర్‌రెడ్డి సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు అతనిపై మాజీ సర్పంచ్‌తో పాటు అతని అనుచరులు విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. కడపర్తి గ్రామంలో బోర్ల బిక్షమయ్య అనే రైతు భూ వివాదంలో ప్రత్యర్థి ఎమ్మెల్యే గన్‌మెన్ కావడంతో ఆ సమస్యను స్థానిక పోలీసులు సంవత్సరం నుంచి పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నత్తనడకన ఆధునికీకరణ పనులు

» గడువు పొడిగించినా చేరని లక్ష్యం » వానాకాలం సీజన్‌కు ముందు పనులు ప్రారంభం » ఆందోళనలో ఆయకట్టు రైతులు



నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగున్నాయి. ఎడమకాల్వ మొదటిజోన్ పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 60 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం 2022లో రూ.183 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో నాణ్యత లేకపోవడంతో పాటు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు సగం కూడా పూర్తికాలేదు.

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

ఎడమకాల్వ పరిధిలోని మేజర్ల ఆధునికీకరణ పనుల గడువు గతేడాది జూన్ నాటికే పూర్తయ్యింది. అయితే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఏడాది పాటు గడువు పొడిగించింది. అయినా పనులు పూర్తికాకపోగా ఎప్పుడు పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆధునికీకరణ పనులు మొత్తం సబ్‌కాంట్రాక్టర్లే చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా సాగర్ ఎడమకాల్వ పరిధిలోని మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ సుమారు 60కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ముక్త్యాల మేజర్ 30 కిలోమీటర్లు, చింతిర్యాల మేజర్ మరో 30 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఎంబీ కెనాల్‌కు సంబంధించి ప్రధాన మేజర్లు లింగగిరి, ముక్త్యేశ్వరపురం, మట్టపల్లి, చింతిర్యాల, రామాపురం, కందిబండ, గుండ్లపల్లి, రెడ్లకుంటతో మైనర్ కాల్వలు ఉన్నాయి. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో ముక్త్యేశ్వరపురం వరకు ఏనాడూ నీళ్లు అందించిన దాఖలాలు లేవు. ఎంబీ కెనాల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 1.15 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించింది. ప్రతి ఏటా బ్రాంచ్ కెనాల్ పరిధిలో 60 శాతం ఆయకట్టుకు మాత్రమే నీరు చేరుతుంది. 40 శాతం ఆయకట్టు చివరి భూములుగా మారాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎడమ కాల్వ పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 2.75లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఎంబీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రస్తుతం ఎంబీసీ మొదటి 14 కిలోమీటర్ల పరిధిలో సబ్ కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. దాంతో పాటు లింగగిరి మేజర్ పరిధిలో సుమారు 9 కిలోమీటర్ల మేరకు పనులు చేయాల్సి ఉంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మూడేళ్లుగా పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.గత ఏడాది వానాకాలం ముందు 14వ కిలోమీటర్ల చివరిభాగంలో సుమారు 5కిలోమీటర్ల పనులు చేసి చేతులు దులుపుకున్నారు. నీటివిడుదలకు ఒక్కరోజు ముందు వరకు పనులు చేయగా ఈ ఏడాది కేవలం మే చివరి వారంలో పనులు మొదలుపెట్టారు. ఎండాకాలం అంతా పనులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఈ ఏడాది తిరిగి వానాకాలం సీజన్ ప్రారంభదశలో పనులు చేపట్టి నామమాత్రంగా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆధునికీకరణ పనుల్లో నిర్లక్ష్యం తగదు



సాగర్ ఆధునికీకరణ పనుల విషయంలో నిర్లక్ష్యం తగదు. వేసవి కాలమంతా పనులు చేయకుండా నీటి విడుదలకు నెల రోజుల ముందు పనులు చేయడం సరైన విధానం కాదు. చివరి భూములకు నీరందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పనుల్లో నాణ్యతా లేదు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు.

\- పల్లె వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, హుజూర్‌నగర్

పనులు పూర్తి చేసేందుకు కృషి

ఆధునికీకరణ పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తాం. మిగిలిన పనులు వచ్చే ఏడాదికి పూర్తిచేస్తాం. రైతుల నీటి అవసరాల దృష్ట్యా పనులు వేగవంతం చేశాం. సాంకేతికపరమైన ఇబ్బందులతో పనులు ఆలస్యమవుతున్నాయి. అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. నాణ్యతతో పనులు జరుగుతున్నాయి.

\- రాంకిషోర్, ఈఈ, ఎన్ఎస్‌పీ

పిచ్చిమొక్కలతో కాల్వలు

ఎంబీ కెనాల్ పరిధిలోని ముక్త్యేశ్వరపురం, మట్టపల్లి మేజర్, లింగగిరి మేజర్లలో కాల్వల పరిస్థితి దయనీయంగా మారింది. కాల్వలు ఆనవాళ్ల కూడా లేకుండాపోయాయి. పిచ్చిమొక్కలతో ప్రధాన మేజర్లు దర్శనమిస్తున్నాయి. మరో రెండు వారాల్లో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు పేర్కొంటుండగా ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతుండడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



ప్రవాహానికి ప్రతిబంధకాలుగా..

ఎడమకాల్వలో పేరుకుపోయిన ఇసుకమేట, వ్యర్థాలు



వేములపల్లి చెరువు అలుగు యూటీ సమీపంలో ఎడమకాల్వలో ఇసుక మేట

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్/ వేములపల్లి)

నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ఎక్కడికక్కడే ఇసుక మేటలు, వ్యర్థాలు కాల్వ నీటిప్రవాహానికి ప్రతిబంధకాలుగా మారాయి. ప్రధానంగా ప్రాజెక్టు వద్ద ఎడమకాల్వ గేట్ల ముందు అడ్డుగా రాళ్లకుప్పలు పేరుకుపోయాయి. 11వేల క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సి ఉండగా రాళ్ల అడ్డుగా ఉండటంతో కనీసం తొమ్మిది వేల క్యూసెక్కుల నీరు కూడా ప్రవహించడం లేదు. కాల్వలోకి నది నుంచి నీళ్ల వచ్చే అప్రోచ్ కెనాల్‌లోనూ రాళ్ల కుప్పలుకుప్పలుగా పేరుకుపోయి నీటి ప్రవాహనికి అడ్డుగా ఉన్నా ప్రాజెక్టు అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎడమ కాల్వ టన్నెల్ ముందు భాగంలో లైనింగ్ వేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. కాల్వ కట్టవెంబడి చెట్లు పెరిగి వేర్లు కాల్వ దారుల్లోకి రావడంతో బండరాళ్లు కూలుతున్నాయి. అవి నీటివిడుదల చేసినప్పుడు టన్నెల్ లోపలికి కూడా కొట్టుకోని పోయి టన్నెల్‌లో కూడా రాళ్ల కుప్పలు ఏర్పడ్డాయి. దీంతో కాల్వలో పూర్తిస్థాయిలో నీరు ప్రవహించకుండా అడ్డంగా బండరాళ్లు ఉంటున్నాయి. వాటిని తొలగించకపోవడంతో నీటిప్రవాహం తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఎడమకాల్వకు మరమ్మతు సమయంలో వ్యర్థాలను కాంట్రాక్టర్లు కాల్వలో వదిలేయడంతో కుప్పగా ఏర్పడి ఇసుకమేటలు తయారయ్యాయి. వేములపల్లి శివారులోని ఎల్-13కి దిగువగా చెరువు అలుగు సమీపంలో అండర్ టన్నెల్(యూటీ) వద్ద వ్యర్థాలను తొలగించలేదు. దీంతో అక్కడ భారీగా రాళ్లు, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ఇవి నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంకిగా మారాయి. అన్నపురెడ్డిగూడెం శివారులోని ఎల్-11, 12 సమీపంలో సైతం ఇసుక మేటలు, వ్యర్థాలు ఒక్కచోట చేరి భారీ కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలతో కాల్వకట్టలు నీటిప్రవాహ ఒత్తిడికి లోనవుతున్నాయి. దీంతో కాల్వ కట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరలో కాల్వలకు నీటి విడుదల చేసే అవకాశం ఉన్నా తొలగించకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఎన్ఎస్పీ మానిటరింగ్ డీఈఈ గోపినాథ్‌ను వివరణ కోరగా వాటిని తొలగించేందుకు అంచనా తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

రాజకీయ కలకలం

(5వపేజీ తరువాయి)

మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల స్థానాల్లో ఎందుకు ఓడిపోయారని,ఈ మంత్రులంతా ఎటు పోయారని ప్రశ్నించడం ద్వారా లోక్‌సభ ఎన్నికలపై రాజగోపాల్‌రెడ్డి చర్చను లేవనెత్తారు. తాజాగా మరోసారి సీఎం వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించడం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోననే ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్‌లో తనకు ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదనే అసంతృప్తిలో ఉన్న రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగానే ఉంటున్నారు. మనుగోడు నియోజకవర్గానికే తన పర్యటనను పరిమితం చేసుకున్నారు. ఇటీవల తుంగతుర్తి సభకు, అంతకుమునుపు హుజూర్‌నగర్ సభకు సైతం ఆయన డుమ్మాకొట్టగా, నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సమీక్షలకు సైతం గైర్హాజరవుతున్నారు. మొత్తంగా రాజగోపాల్‌రెడ్డి రాజేసిన అసమ్మతి ఎంతమేరకు విస్తరిస్తుందనే అంశంపై ప్రతిపక్షాలు సైతం ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులుండగా, అధిష్ఠానం ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ రాజగోపాల్‌రెడ్డి, ఎస్టీ కోటాలో ఇవ్వాలని బాలూనాయక్ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య సైతం ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక సమావేశంలో యాదవ సామాజికవర్గానికి కేబినెట్‌లో స్థానం లేదని, అవకాశం కల్పించాలని డిమాండ్ చేయడంతోపాటు, అధికార పార్టీలో ఆ సామాజికవర్గం నుంచి తానొక్కరినే ఎమ్మెల్యేననే విషయాన్ని ప్రస్తావించడం ద్వారా మంత్రిపదవికి పోటీలోకి వచ్చారు. మరోవైపు మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు తమ వర్గానికి కేబినెట్‌లో స్థానం కల్పించాలంటూ ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసి విన్నవించగా, అందులో మందుల సామేల్, వేముల వీరేశం ఉన్నారు. వీరందరి విజ్ఞప్తి మేరకే అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి దక్కిందని ఇటీవలి తుంగతుర్తి సభలోనూ నాయకులు ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి ఒంటరి పోరాటంగా మిగులుతుందా..? లేక ఆయనతో ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు గళం కలుపుతారా...? అనే అంశం తేలాల్సి ఉంది.

జగ్గయ్యపేట నుంచి చింతిర్యాలకు
ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం



జగ్గయ్యపేట నుంచి చింతిర్యాలకు ఆర్టీసీ బస్ సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య

చింతలపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుంచి సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని చింతిర్యాల వరకు బస్సు సర్వీసును జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య శనివారం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రోజుకు ఐదు మార్లు బస్సు రాకపోకలు ఉంటాయన్నారు. చింతలపాలెం మండలంలోని విష్ణు సిమెంట్, దొండపాడు, గుడిమల్కాపురం, మల్లారెడ్డి, పాతవెల్లటూరు ఎక్స్‌రోడ్డు, శోభనాద్రిగూడెం, తమ్మారం, కొత్తూరు ఎక్స్‌రోడ్డు, కిష్టాపురం, నక్కగూడెం, చింతిర్యాలరేవు వరకు ఉన్న గ్రామాల ప్రజలకు బస్సు సర్వీసు అందుబాటులో ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య దృష్టికి తీసుకెళ్లిన మంత్రి ఉత్తమ్

జగ్గయ్యపేట నుంచి చింతిర్యాలకు బస్‌సర్వీసుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేసినట్లు కాంగ్రెస్ పార్టీ చింతలపాలెం మండల అధ్యక్షుడు నరాల కొండారెడ్డి తెలిపారు. కరోనా ముందు బస్ సర్వీసులు చాలా ఉండేవని, కరోనా నుంచి నిలిపివేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన జగ్గయ్యపేట ఎమ్మెల్యే తాతయ్యకి చెప్పడంతో ఆయన ఏర్పాటుచేయించారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ శ్రీనివాస్‌శర్మ, బొబ్బ కోటిరెడ్డి, రాములునాయక్, చిలకల శ్రీనివాసరెడ్డి, దానం, రఘురాం పాల్గొన్నారు.

సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు డీలక్స్ బస్సులు ప్రారంభం

సూర్యాపేటఅర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో నుంచి ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సులు శనివారం నుంచి బస్సులు ప్రారంభమయ్యాయి. ఉదయం 6.10 గంటల నుంచి రాత్రి 8.40 గంటల వరకు ప్రతీ గంటకు ఒక బస్సు చొప్పున 15ట్రిప్పులు నడుపుతున్నామని డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డీలక్స్ బస్సులు సూర్యాపేట నుంచి సింగిల్‌స్టాప్, సూపర్‌ఫాస్ట్ సర్వీసులుగా నడిపిస్తామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం ప్రకటనలో పేర్కొన్నారు.



● ఫిష్ వెంకట్‌తో రాయిగిరికి అనుబంధం



హైదరాబాద్‌లో శుక్రవారం మృతి చెందిన సినీనటుడు, కమెడియన్ ఫిష్ వెంకట్‌తో యాదాద్రిభువనగిరి జిల్లాకు అనుబంధం ఉంది. 2022లో మే 5న వేసవి స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడల శాఖ, శాంతి ట్రాక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడల్లో ఆయన చిన్నారులతో కలిసి పాల్గొని గ్రూప్ ఫొటో దిగారు. ఆయన మృతికి యువజన సంఘాల సమితి జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

-(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

అఖిలపక్షాన్ని వెంటనే ఢిల్లీకి తీసుకెళ్లాలి



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన అమలులో రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ తరహాలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు కార్యాచరణ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 42శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్పించాలన్నారు. చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత బీజేపీపై ఉందన్నారు. లేదంటే బీసీ వ్యతిరేక పార్టీగా, దోషులుగా తెలంగాణ సమాజం ముందు నిలబడాల్సి వస్తోందని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పంపించిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ సానుకూల దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రస్తుతం బీసీలకు అమలవుతున్న 27శాతం రిజర్వేషన్లలో కూడా ముస్లిం సమాజం ఉందని, అదేవిధంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన చాలా రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లను మత ప్రతిపాదికన అమలు చేస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్‌లు ద్వంద విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ గౌడ్, విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొగాకు రవికుమార్‌యాదవ్, శ్రీకాంత్, మహేష్, మణికుమార్, రాములు, శివ, యాదగిరి, ప్రభాకర్, నరసింహ, మహేష్, పృధ్వీ, సాత్విక్, ప్రదీప్, పునేందర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యపూజలు





నిత్యకల్యాణోత్సవంలో హారతి ఇస్తున్న అర్చకుడు, సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శన

యాదగిరిగుట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, అర్చించారు. ప్రాకారమండపంలో సుదర్శన హోమం వైభవంగా చేపట్టారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లను తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్యతిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో నిత్యారాధనలు, నిత్య రుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ కళావేదిక మండపంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.31,88,975 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. కాగా స్వామి వారిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ మనువడు సర్వేపల్లి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. పండితులు వేదమండపంలో వారికి వేదఆశీర్వచనం చేయగా చిత్రపటం, లడ్డూ ప్రసాదం ఆలయ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆధ్యాత్మిక మాసపత్రిక ఎడిటర్ ఈశ్వర్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

23న హుండీ కానుకల లెక్కింపు

స్వామివారి హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కొండకింద వ్రత మండపంలో ఉదయం ఏడు గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

కనగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్యగౌడ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ రకాల మొక్కలను నాటి మాట్లాడారు. చెట్లు వాతావరణంలో కాలుష్యం తగ్గించి ప్రాణవాయువును అందజేస్తాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గాలి నాగేశ్వర్‌రావు, ఉపేందర్‌రెడ్డి, సిబ్బంది వెంకటయ్య, లక్ష్మమ్మ, అండాలు, నాగరాజు పాల్గొన్నారు.

సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలి

చిట్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లో ఈ నెల 24న డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. చిట్యాలలో శనివారం సైకిల్‌యాత్ర పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలని డిమాండ్ చేస్తూ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వడ్డగాని మహేష్, ఉపాధ్యక్షుడు గణేష్, శ్రీను, సాయికిరణ్, మనోజ్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



గొల్లగూడలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు

- అస్తవ్యస్తంగా అండర్‌గ్రౌండ్ నిర్మాణ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నల్లగొండ పట్టణంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం పలు చోట్ల గుంతలు తవ్వి వదిలేశారు. పని పూర్తయిన తర్వాత సదరు కాంట్రాక్టర్ గుంతలను పూడ్చి వేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో చేపట్టిన పనులను రెండో విడతలో భాగంగా చేపడుతున్నారు. అనేక చోట్ల పైప్‌లైన్, మ్యాన్‌హోల్స్ నిర్మాణం కోసం చేపట్టిన పనులు ముందు చూపులేకుండా చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లగూడలో అంధుల పాఠశాలకు వెళ్లే మార్గంలో గతంలో కవర్ కాని వీధుల్లో అండర్‌గ్రౌండ్ పైపులైన్, డ్రైనేజీ పనులను ఇటీవల చేపట్టారు. అయితే పైపులైన్, మ్యాన్‌హోల్స్ కోసం ఎక్స్‌కవేటర్లతో గుంతలు తీసిన కాంట్రాక్టర్ పనులు పూర్తయ్యాక మట్టిని సరిగా చదును చేయకపోవడంతో ఆ మార్గం ద్వారా వెళ్లే వాహనాలు కాదు కదా కనీసం నడవలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నచిన్న వర్షాలకే రోడ్డంతా బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ పనులు పూర్తయినందన వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇక నాలుగో వార్డు కేశరాజుపల్లి ఎస్సీ కాలనీలో కూడా ఇదే సమస్య ఉత్పన్నమైంది. కాలనీలో అసలే ఇరుకుగా ఉండే వీధుల్లో మ్యాన్‌హోల్స్ నిర్మాణం కోసం పెద్దపెద్ద గుంతలను తీసి వాటిని సరిగా పూడ్చకపోవడంతో ఇళ్ల ఎదుట రోడ్లపై మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. వెంటనే మట్టిని చదును చేసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీ ప్రాంతాల్లో పనులు

పట్టణంలో అండర్‌గ్రౌండ్ నిర్మాణంలో భాగంగా 20 సంవత్సరాల క్రితం మెదటి విడత పైపులైన్లు వేశారు. కానీ సీవరేజ్ ప్లాంటు ఏర్పాటు చేయకపోవడంతో అనేక చోట్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వందల కోట్లు వెచ్చించినప్పటికీ మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లుతున్నాయి. ఫలితంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అయితే తాజాగా మంజూరైన నిధుల ద్వారా గతంలో కవర్‌కాని ప్రాంతాల్లో పనులు చేపడుతున్నారు.

అయితే ఇందులో ప్రాధాన్యత క్రమంలో ఇళ్లు ఉన్న చోట కాకుండా ఖాళీ ప్లాట్ల వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. యూజీడీ పనులు చేసిన దగ్గర పెద్ద పెద్ద గుంతలు పడటం వల్ల మ్యాన్‌హోల్స్ రోడ్డుపైకి ఉండటంతో ప్రమాదాల బారినపడే అవకాశం కూడా లేకపోలేదు. యూజీడీ నిర్మాణం జరిగిన ప్రతీ చోట సీసీ రోడ్లు వేయాలని, సీవరేజీ ప్లాంటు పూర్తి చేసి యూజీడీ పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణం తక్షణమే చేపట్టాలి



అండర్‌గ్రౌండ్ నిర్మాణం కోసం తీసిన గుంతలను సరిగా పూడ్చకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు వస్తే ఈ మార్గంలో నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. అండర్‌గ్రౌండ్ పనులు పూర్తయినందున వెంటనే ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి. దోమల బెడద కూడా ఎక్కువగా ఉన్నందున ఫాగింగ్ చేయాలి.

- నాంపల్లి యాదయ్య, నల్లగొండ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

సౌమ్య శృతి, ఏవో, శాలిగౌరారం



రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని ఏవో సౌమ్యశృతి తెలిపారు. పంట మార్పిడి చేయడం వల్ల భూసారం పెరుగుతుందని అన్నారు. శనివారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎరువుల కొరత ఉందా?

ఏవో: ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి మండలంలో ఇప్పటి వరకు ఎరువుల కొరత లేదు.

ఆంధ్రజ్యోతి: వానాకాలం పంటల సాగు ఎలా ఉంది?

ఏవో: మండలంలో ఈ సారి అధికంగా పత్తి పంట 23,320 ఎకరాలు, వరి 20,150 ఎకరాల్లో సాగుచేశారు. మిరప, కంది, పెసర పంటలు అంతర్గతంగా మాత్రమే సాగుచేశారు.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా డబ్బులు రైతుల అందరి ఖాతాల్లో జమ య్యాయా?

ఏవో: మండలంలో 18,192 మంది రైతుల ఖాతాల్లో 26కోట్ల29లక్షల71వేల631 రూపాయలు జమ అయ్యాయి. కొద్ది మంది రైతుల బ్యాంకు ఖాతాలు తప్పు ఉండటం వల్ల పడలేదు. సరి చేసి పంపించాం. వారికి కూడా జమ అవుతాయి.

ఆంధ్రజ్యోతి: రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గడువు ఎప్పటి వరకు ఉంది?

ఏవో: రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గడువు ఈ నెల 31వ తేదీ వరకు ఉంది. అయితే వెంటనే చేసుకుంటే పీఎం కిసాన్ యోజన డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయి. లేకపోతే జమ కావు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మందుల సామేలు

శాలిగౌరారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా రంజకమైన పాలన చేస్తుందన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక స్థానాల్లో గెలవబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, సింగల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళీ, వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి, తహసీల్దార్ షేక్ జహీరుద్దీన్, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, డిప్యూటీ తహసిల్దార్ బిట్ట వరప్రసాద్, ఆర్ఐలు అజారుద్దీన్, రఫీ, నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్, చామల జయపాల్ రెడ్డి,చింత ధనుంజయ్, కుతాటి సోమయ్య, వడ్లకొండ పరమేష్ గౌడ్, దండ అశోక్‌రెడ్డి, పుల్లూరి దేవేందర్ పాల్గొన్నారు.

● శాలిగౌరారంలోని నకిరేకల్ - గురజాల ప్రధాన రహదారిలో కాటమయ్య గుడి సమీప ంలో ఎమ్మెల్యే మందుల సామేల్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి లక్ష్మి, ఉపాధిహామీ ఏపీవో జంగమ్మ, ఈసీ విశ్వనాథుల వెంకటాచారి, ఫీల్డ్ అసిస్టెంట్ బట్ట సైదులు తదితరులు పాల్గొన్నారు



శాలిగౌరారంలో కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

ఘనంగా గోరింటాకు సంబురాలు

నల్లగొండ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్య జిల్లా సంఘం భవనం నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా వాసవీ మాతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన వందలాది మంది మహిళలకు తంబోలా గేమ్స్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరము సామూహికంగా చెట్ల నుంచి గోరింటాకును తీసుకువచ్చి, గౌరీ దేవి ముందు ఉంచి శాస్త్రక్తంగాప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ పూజ అనంతరం సంప్రదాయబద్ధంగా గోరింటాకు నూరి, చేతులపై రకరకాల డిజైన్లలో పెటు కున్నారు. సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ,వనితా క్లబ్ , మహిళలు కాసం శోభారాణి, బండారు జ్యోతి, వనమా పద్మ, కొమిరిశెట్టి రమాదేవి, గుబ్బ లీలారని, పెట్నకోట హరిత ,వనమా శోభారాణి ,లక్ష్మిశెట్టి పారిజాత, లకుమారపు సునీత, సోమ హైమావతి, మురారి శెట్టి నందిని, సోమా దీప్తి, మిట్టపల్లి కలమ్మ, మురారి శెట్టిరత్నమాల, తల్లం కల్పన, మిర్యాల సౌభాగ్య, మురారి శెట్టి సునీత తదితరులు పాల్గొన్నారు

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో...

నల్లగొండ టౌన్: బీజేపీ టూటౌన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు మహోత్సవ ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు గుగులోతు తార ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీలకు అతీతంగా పట్టణ మహిళలు పాల్గొని ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ వెంట తీసుకొచ్చిన గోరింటాకును గౌరీ దేవి ముందు ఉంచి శాస్త్రక్తంగాప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ పూజ అనంతరం సంప్రదాయబద్ధంగా గోరింటాకు నూరి చేతులపై రకరకాల డిజైన్లలో పెట్టుకున్నారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో పాటు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావిరాల కాశమ్మ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ కూతురు విజయ, నెవర్సు నీరజ, జిల్లా జనరల్ సెక్రటరీ రామోజ్ విజయ, ఐతరాజు నాగేశ్వరి, భద్రమ్మ, కూతురు సత్యవతి, శ్రీదేవి, బండారు కళావతి ,తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గోరింటాకు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సమాచారం

ఎస్ఐగా రాజీవ్‌రెడ్డి

కనగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కనగల్ ఎస్ఐగా రాజీవ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన విష్ణుమూర్తి నల్లగొండ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా రాజీవ్‌రెడ్డి బాధ్యతలు తీసుకోనున్నారు.

రైల్వే క్వార్టర్స్‌ను పరిశీలించిన ఎస్ఐ

నార్కట్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి శివారులోని పాత రైల్వే క్వార్టర్స్‌ను ఎస్ఐ క్రాంతికుమార్ శనివారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరి నిర్జీవ ప్రదేశంగా ఉన్న క్వార్టర్స్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లి అక్కడి పరిసరాలను తనిఖీ చేశారు. తాగి పడేసిన మద్యం సీసాలను చూశారు. అక్కడే ఉన్న రైల్వే గ్యాంగ్‌మెన్‌లతో మాట్లాడి మద్యం తాగేందుకు ఏసమయంలో వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ మోటార్ చోరీ

శాలిగౌరారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజపురం గ్రామంలో కాసాని మల్లయ్య అనే రైతుకు చెందిన మోటార్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ సమీపంలో ఉన్న తమ పొలానికి చెరువులో నుంచి నీటిని సరఫరా చేసేందుకు కొత్త మోటార్ ఏర్పాటు చేసినట్లు తెలిపాడు. ఆ మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

● మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రామగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ జరుగుతున్న రోడ్డు విస్తరణలో ప్రజలు సహకరించి వారి రోడ్డు ఆక్రమణ, కట్టడాలు ఆస్తులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ కోరారు. శనివారం బస్టాండ్ నుంచి గొల్లగూడెం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను, మిర్యాలగూడ రోడ్డులో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ రోడ్డు విస్తరణలో కొన్ని కట్టడాలు తొలగించుకోకపోవడం వల్ల ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. వాటిని యజమానులు రెండు రోజుల్లో తొలగించుకోవాలని నోటీసులు అందజేస్తామన్నారు. పనులు ఆలస్యంగా జరుగుతున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అనుకున్న ప్రకారంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ అశోక్, ఏసీపీ కృష్ణవేణి, టీపీవో సుకన్య, టీపీబీవో ఆఫీఫ్ రెహ్మాన్ తదితరులున్నారు.

● మునిసిపల్ మెప్మా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మైసయ్య విగ్రహం వద్ద స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. పలు రకాల వంటలను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ ఫెస్టివల్ ఎగ్జిబిషను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ శివాజీనాయక్ టీఎంసీ శ్రీనివాస్, సీఈవోలు అనిల్, జ్యోతి, నరసింహ పాల్గొన్నారు.

చెర్వుగట్టును సందర్శించిన మీరా రామనాథన్



చెర్వుగట్టు ఆలయంలో పూజల్లో పాల్గొన్న మీరా రామనాథన్

నార్కట్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ (పూర్తి అదనపు బాధ్యతలు) చైర్మన్ మీరా రామనాథన్ శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ప్రధానాలయంలోని జడల రామలింగేశ్వర స్వామి మూలవిరాట్టు సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రామనాథన్‌కు అర్చకులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం గుట్టపై ఉన్న ఇతర ఉపాలయాలను సందర్శించారు.

విద్యార్థులు మంచి పౌరులు కావాలన్నదే లక్ష్యం



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

దివంగత దినేశ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దినేశ్ జ్ఞాపకార్థం శనివారం మండలంలోని చెర్వుగట్టు ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు నోటు బుక్స్ బ్యాగులు, పెన్నులు అందజేశారు. తాను రాజకీయంగా ఎంత ఎదిగినా తన కొడుకు దినేశ్ మాత్రం సమాజ సేవ పట్ల ఆకర్షితుడయ్యేవాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, దాసోజు కోటి, గబ్బర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి పౌరులుగా కావాలన్నదే రేగట్టె దినేశ్ ఫౌండేషన్ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. తన కుమారుడు

ఆడిటోరియాన్ని వెంటనే పూర్తి చేయాలి



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న కళాకారులు

నల్లగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఆడిటోరియాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఆడిటోరియం లేక రంగస్థల కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కోమలి కళాసమితి నల్లగొండ ఆధ్వర్యంలో శనివారం మాజీఎమ్మెల్యేను నాటకాలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండేళ్లవుతున్నా ఇంతవరకు నిర్మాణ పనులు చేపట్టలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, కోమలి కళా సమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, ఎంఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో అంతరకృషితో కలుపు నివారణ



రైతులతో మాట్లాడుతున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నుం చి రైతులు సాగు చేసిన పత్తి పంటను కాపాడుకోవడానికి ఎరువులను నీళ్లల్లో కలిపి పంటపై పిచికారీ చేయడం మేలని ఏవో బి.పురుషోత్తం సూచించారు. కేతేపల్లి మండలకేంద్రంలో శనివారం పత్తి పంటలను పరిశీలించి క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడారు. యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువులను సమపాళ్లలో కలిపే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో వెంట రైతులు మున్న సొడయ్య, సందీప్, కాసాని చంద్రయ్య, శివ, సైదులు తదితరులు ఉన్నారు.

కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

నార్కట్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసవులు బాసిన పజ్జూరి కృష్ణారెడ్డి స్ఫూర్తిగా ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన పజ్జూరి కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణారెడ్డితో పాటు సరసనపల్లి ఎన్‌కౌంటర్ అమరవీరులకు నివాళులర్పించారు. పీడిత ప్రజల విముక్తి కోసం, దున్నేవానికి భూమి అనే నినాదంతో ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట వేలాది ఎకరాలను అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికి విప్లవీరులను మట్టుబెడుతుందని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పజ్జూరి ఉపేంద్ర, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, నాయకులు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు, అరుణోదయ రాష్ట్ర నాయకుడు ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పీవైఎల్ జిల్లా నాయకులు బీవీ చారి, అనిల్, వెంకన్న, పోలే పవన్, నర్సింహ, జానయ్య, వెంకటేశం, శంకర్, సత్తయ్య, కల్లూరి అయోధ్య, ప్రవీణ్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'రజాకార్'కు అవార్డు రావడం హర్షణీయం



దర్శకుడు సత్యనారాయణను సన్మానిస్తున్న బిజేయూ నాయకులు

చిట్యాల, జూలై19, (ఆంధ్రజ్యోతి): రజాకార్ సినిమా గత చరిత్రనే కానీ, మత చరిత్ర కాదని ఆ సినిమా దర్శకుడు యాట సత్యనారాయణ తెలిపారు. ఉత్తమ చారిత్రక సినిమాగా రజాకార్ సినిమా గద్దర్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనకు శనివారం చిట్యాలలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది విమర్శకులు రజాకార్ సినిమాకు వక్రభాష్యం చెబుతున్నారు. కానీ అందులో వాస్తవం లేదన్నారు. టాలెంట్ ఎవడిసొత్తు కాదనీ ప్రతిభాసామర్థ్యాలు ఉన్నవారు ఎప్పటికైనా రాణించగలుగుతారన్నారు. విజయానికి దొడ్డిదారి ఏమి ఉండదని, కష్టపడి పనిచేస్తే లక్ష్యం చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ల బయ్యన్న, సహాయ కార్యదర్శి పెద్ది నరేందర్, మండల అధ్యక్షుడు మెండె వెంకన్న, పోకల కరుణాకర్, చెరుపల్లి శ్రీనివాస్, ఏళ్ల వెంకన్న, మిర్యాల ప్రకాష్, జిట్ట మల్లేషం, వెంకన్న, మధు పాల్గొన్నారు.

స్కూల్ కేబినెట్ ఎన్నికలు



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు


కేతేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం స్కూల్ కేబినెట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం సాధారణ ఎన్నికల నిర్వహణ తీరులో పాఠశాల అధ్యక్షుడు, అధ్యక్షురాలు, ఉపాధ్యక్షుడు, ఉపాధ్యక్షురాలు పదవులకు సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాఠశాల విద్యార్థులు వరుస క్రమంలో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సందర్భంగా పోలైన ఓట్లను ఈ నెల 26న లెక్కించి ఎన్నికల్లో గెలుపొందిన వారితో అదే రోజు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పాఠశాల పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ షాజు జార్జి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంజిత్, పాఠశాల బోధనా, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.0
కనిష్ఠం 23.4

***



నల్లగొండ

5

ఆదివారం 20 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	565.00 (244.1480)	67,800	1800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.40 (3.54)	243.51	299.63
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.573 (16.8784)	నిల్	400

చికెన్ ధరలు: లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230

కాల్వల భూ సేకరణ వేగవంతం చేయాలి

- బీ.వెల్లెంల నల్లచెర్వును నీటితో నింపండి
- అవసరమైతే మైనర్ కాల్వను తవ్వండి
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచన




బీ.వెల్లెంల రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కుడి,ఎడమ కాల్వల భూ సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. భూ సేకరణతో పాటే కాల్వల తవ్వకం పనులను చేపట్టి, ఆయకట్టు పరిధిలో సాగునీటిని అందించేందుకు దృష్టి సారించాలన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని తన స్వగ్రామం బ్రాహ్మణవెల్లెంలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం రిజర్వాయర్‌ను పరిశీలించారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ నీటిని పక్క మండలాల్లోని రైతులు కూడా మళ్లించుకుని చెర్వులను నింపుకుంటుంటే బీ.వెల్లెంలలోని నల్లచెర్వుకు నీరు చేరే మార్గం లేదంటూ గ్రామస్థులు తన వద్ద ఆవేదన వ్యక్తం చేశారని ప్రాజెక్టు అధికారులను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. వెంటనే నల్లచెర్వుకు నీటిని తరలించేలా డిస్ట్రిబ్యూటరీ నుంచి మైనర్ కాల్వ తవ్వాలని ఆదేశించారు. కుడి ఎడమ కాల్వల పరిధిలో ఇంకా ఎన్ని ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని ఈఈ శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి అడిగారు. సుమారు 9 ఎకరాల మేర భూ సేకరణ పూర్తిచేయాల్సి ఉందని చెప్పారు. కాల్వల భూ సేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసినందున ఎట్టిపరిస్థితుల్లో భూసేకరణ పూర్తిచేయాలని, ఏమైనా అవాంతరాలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా నాగార్జునసాగర్ నుంచి త్వరలో నల్లగొండ పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు నీటి చేరిక ఉంటుందని అదే సమయంలో బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్‌ను కూడా ఎఫ్ఆర్ఎల్‌కు చేర్చాలని ప్రాజెక్టు ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీఈఈలు విఠలేశ్వర్, పిచ్చయ్య, మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయ కలకలం

- సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన రాజగోపాల్‌రెడ్డి
- 'ఎక్స్'వేదికగా తన అభిప్రాయం స్పష్టం
- నిఖార్సయిన నాయకులు, కార్యకర్తలు సహించరని హెచ్చరిక
- తరుచూ కీలక ప్రకటనలతో రాజగోపాల్ సంచలనం
- అధిష్ఠానం మాట తప్పిందనే ఆవేదన



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో చేసిన ట్వీట్ రాజకీయ కలకలం రేపింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలను తప్పు బడుతూ ట్వీట్ చేయడం కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలను బహిర్గతం చేసినట్లయింది. గతంలోనూ రాజగోపాల్‌రెడ్డి మాజీ మంత్రి జానారెడ్డిపైనా ఇదేరీతిలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో జరిగే పార్టీ సభలకు, నల్లగొండ జిల్లాలో జరిగే జిల్లాస్థాయి అధికారిక కార్యక్రమాల్లో సైతం రాజగోపాల్‌రెడ్డి ఒకటిరెండు కార్యక్రమాల్లో మినహా మిగిలిన వాటికి గైర్హాజరవడం, నియోజకవర్గానికి మాత్రమే తన పర్యటనలను పరిమితం చేసుకోవడం ఆయన అసంతృప్తిని తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఎక్స్‌వేదికగా రాజగోపాల్‌రెడ్డి సీఎం ప్రసంగాన్ని నేరుగా ఖండించడం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.

తీవ్ర అసంతృప్తిలో రాజగోపాల్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంలో తనకు మంత్రి పదవి పక్కాగా వస్తుందనే ధీమాలో ఉన్న రాజగోపాల్‌రెడ్డికి ఇటీవలి విస్తరణలో సైతం అవకాశం దక్కకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు ఈ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోందనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. తనకు మంత్రిగా అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన మాట వాస్తవమని, అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానన్నప్పటికీ, దుర్మార్గంగా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారంటూ ఆయన గతంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార సందర్భంలో తీవ్రవ్యాఖ్యలు చేశారు. అదే వేదిక మీద మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేయడం అప్పట్లో సంచలనం కలిగించగా, ఆతర్వాత ఆ వ్యవహారం సద్దుమణిగింది. ఇటీవల సైతం ఆయన వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం తాను మంత్రిపదవి అడుగుతానని, తనకు మంత్రిగా బాధ్యతలిస్తే వెనకబడిన ప్రాంతాలకు అబివృద్ధి రుచి చూపిస్తానని రాజగోపాల్‌రెడ్డి తన ప్రసంగాల్లో పేర్కొంటున్నారు. సమర్థత గీటురాయిగా మంత్రిపదవులివ్వాలే తప్ప, కులం, మతం, జిల్లాలను అడ్డుగా చూపి సమర్థులకు అవకాశాలివ్వకపోవడం సరికాదనే వాదన రాజగోపాల్‌రెడ్డి మద్దతుదారుల్లో వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా..

రాజగోపాల్‌రెడ్డి ఎక్స్ వేదికగా సీఎం ప్రసంగాన్ని తప్పుబడుతూ ఘాటుగానే స్పందించారు. కాంగ్రెస్‌లో సీఎం పదవికి ఎంపిక విధానం ఎలా ఉంటుందో వివరించారు. జాతీయపార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాలమేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌ని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరని ఎక్స్‌లో పేర్కొనడం ద్వారా తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఈ ట్వీట్ ద్వారా పార్టీలో అంతర్గత కుమ్ములాటల అంశం మరోసారి బహిర్గతమైంది. కాంగ్రెస్‌ని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాన్ని సహించబోమని పేర్కొనడం ద్వారా రాజగోపాల్‌రెడ్డి సీఎంకి నేరుగా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చర్చ సాగుతోంది.

లోక్‌సభ ఎన్నికల సమయంలో..

లోక్‌సభ ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలో ఒక్కో సీటుకు ఒక్కో మంత్రి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఎక్కడాలేని విధంగా భువనగిరిలోనే ఒక ఎమ్మెల్యేనైన తనకు ఇన్‌చార్జిగా బాధ్యతలిచ్చారంటే, తన సమర్థతపైనా, అభ్యర్థిని గెలిపిస్తాననే నమ్మకం ఉండ బట్టే ఇచ్చారని, ఆ ఎన్నికలో అన్ని నియోజకవర్గాలు తిరిగి అభ్యర్థిని గెలిపించడమే తన సమర్థతకు, పనితీరుకు నిదర్శనమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొంటున్నారు. మంత్రులు ఇన్‌చార్జిలుగా ఉన్న మహబూబ్‌నగర్, సికింద్రాబాద్...

మిగతా 7వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

కట్టంగూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కట్టంగూర్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కట్టంగూర్ మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో వచ్చే బుధవారం నాటికి కనీసం 50 శాతానికి తగ్గకుండా గ్రౌండింగ్ కావాలన్నారు. అదే విధంగా వనమహోత్సవం కింద సకాలంలో గుంతల తవ్వకం, మొక్కలు నాటడం వంటివి పూర్తిచేయాలన్నారు. ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాని గ్రామాల్లో వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో పురోగతి ప్రదర్శించని గ్రామాల పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆది, సోమవారాలు కూడా పనిచేసి పురోగతికి వచ్చేలా ప్రయత్నం చేయాలన్నారు. అదేవిధంగా ఏపీవోతో వనమహోత్సవంపై సమీక్ష చేశారు. కార్యక్రమం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గుంతల తవ్వకం, మొక్కలు నాటడం సకాలంలో పూర్తిచేయాలని, ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కనగల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై జీపీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాల వారీగా నిర్మాణం పనుల పురోగతిని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా ఇంకా ప్రారంభంకాకపోవటంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ పథకం అమలులో కార్యదర్శులు చూపుతున్న నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు చేపట్టకుండా అశ్రద్ధ చూపుతున్న వారి పేర్లతో జాబితాను తయారు చేసి నివేదిక అందజేయాలన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, ఏఈ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఆర్టిజన్లకు న్యాయం చేయాలి

- టీవీజేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు
- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వంటావార్పు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్

నల్లగొండ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల విద్యార్హతలను బట్టి న్యాయం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వెన్షన్ జేఏసీ (టీవీఏసీ జేఏసీ) రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీవీఏసీ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయ ఆవరణలో వంటా వార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయడం వల్ల విద్యుత్ సంస్థలపై పెద్దగా భారం పడదన్నారు. ఆర్టిజన్స్ విషయంలో గత పాలకు చేసిన తప్పులు ప్రస్తుత పాలకులు చేయకుండా కన్వర్షన్ ఇచ్చి వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, గృహజ్యోతి వంటి పథకాల అమలులో కార్మికుల దే కీలకపాత్ర అని అన్నారు. అందుకే విద్యార్హతలను బట్టి చదువుకు తగ్గ పోస్టులు ఇవ్వాలన్నారు కన్వర్షన్ సాధించేందుకు విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టీజన్లందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వారు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ వెన్నమల్ల నరేందర్, శ్రీపతి రమేష్, కో కన్వీనర్ సలీంపాష, జాయింట్ సెక్రటరి మురళి పెరుమాళ్ల, జిల్లా కన్వీనర్ పెరక శేఖర్, యాదాద్రి జిల్లా కన్వీనర్ అహ్మద్‌పాష, సూర్యాపేట జిల్లా కన్వీనర్ మేడి యాదయ్య, జిల్లా నాయకులు విజయ్‌కుమార్, జిట్టిపల్లి లింగస్వామి, బొప్పని యాదయ్య, లక్ష్మీనారాయణ, సత్తిరెడ్డి , కాశీరాం పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి

ఎస్పీ శరత్ చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన నిందితులకు శిక్ష పడే పడే విధంగా కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు, కోర్టు డ్యూటీ ఆఫీసర్‌లకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేసులో నిందితులను దోషులుగా నిరూపించి, శిక్షలు పడేలా పని చేయాలన్నారు. కోర్టు అధికారులు, ప్రాసిక్యూటర్ల సమన్వయంతో న్యాయ సలహాలు అడిగి పని చేయాలన్నారు.కేసు తుది దశలో సాక్ష్యులు, నిందితులు, బాధితులను సమయానికి కోర్టులో హాజరుపరిచేలా చూసుకోవాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడేలా పనిచేయడంలో సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారితోపాటు కోర్టు డ్యూటీ సిబ్బందికి చాలా బాధ్యత ఉంటుందన్నారు. కోర్టుకేసుల్లో నిందితులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, తద్వారా ప్రజలకు పోలీసశాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ సంవత్సర కాలంలో జిల్లావ్యాప్తంగా ఒకరికి ఉరిశిక్ష పడగా, 10మందికి జీవిత ఖైదు, వివిధ కేసుల్లో మొత్తం 75మందికి శిక్షలు విధించారన్నారు. ఈసందర్భంగా ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, అఖిల, జవహర్‌లాల్, రంజిత్ కుమార్, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐవెంకట్ రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- జడ్పీసీఈవో శ్రీనివాసరావు



సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీసీఈవో శ్రీనివాస రావు

మునుగోడు రూరల్, మునుగోడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించి, లక్ష్యాన్ని పూర్తి చేయాలని జడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, ఇతర ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో పలు అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించి సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు అన్నీ వీలయినంత త్వరగా గ్రౌండింగ్ చేయించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో విజయ భాస్కర్, మహ్మద్ అథర్ పర్వేజ్, నాగరాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇక ఆస్తి రికార్డులు పదిలం

- మునిసిపాలిటీల్లోని ఆస్తులపై సమగ్ర సర్వే

గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సాధికారత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో ఆస్తులను డ్రోన్ల ద్వారా సర్వే, మ్యాపింగ్ చేసి యాజమాన్య హక్కులు, ప్రజలకు ఆస్తి(ప్రాపర్టీ) కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం కేంద్ర సర్వే ఆఫ్ విలేజస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వామిత్వ) పథకాన్ని ప్రవేశపెట్టింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్ పట్టణంలోనే సర్వే జరిగింది. ఈ నగరంలో ఏ ఆస్తి ఎవరిది అన్న రికార్డులు పక్కాగా ఉన్నాయి. అయితే మిగతా అన్ని జిల్లాల్లో పల్లెలు, పట్టణాల్లో సర్వే చేపట్టలేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గతంలో ఇళ్ల స్థలాలన్నీ చాలావరకు గ్రామకంఠంగా నమోదు చేశారు. దీంతో ఇల్లు నిర్మించుకున్నా రికార్డుల్లో మాత్రం అవే వివరాలు లభ్యమవుతాయి. దీంతో ఇళ్ల విక్రయించాలనుకున్నా... కొనుగోలు చేయాలన్నా సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలనే కేంద్రం అడుగులు వేస్తోంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తోన్న స్వామిత్వ పథకం రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండ గా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట మునిసిపాలిటీ, మిర్యాలగూడ మునిసిపాలిటీలోని రెవెన్యూ గ్రామాల్లో ఈ సర్వేను చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకు పైలట్ ప్రాజెక్టు కింద యాదగిరిగుట్ట, మిర్యాలగూడ మునిసిపాలిటీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. యాదగిరిగుట్టలో 12 వార్డుల్లో దాదాపు 15 వేల నుంచి 18వేల జనాభా ఉండగా, మిర్యాలగూడ మునిసిపాలిటీలో 48 వార్డుల్లో దాదాపు 1,09,891 జనాభా ఉంది. ఇప్పటికే ఈ మునిసిపాలిటీల పరిధిలో స్వామిత్వ పథకం కింద డ్రోన్ సర్వే పనులు చకచక కొనసాగుతున్నాయి. సంస్కరణల్లో భాగంగా ఇళ్లతోపాటు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ ఆస్తులపై పూర్తిస్థాయి మ్యాప్‌లను తీయించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

సామాజిక, ఆర్థిక ప్రమాణాల మెరుగుదల

మునిసిపాలిటీల పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూమిని మొత్తాన్ని ప్రత్యేకంగా మ్యాప్‌గా రూపొందిస్తారు. తద్వారా ఇంటి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్యకార్డులు (ఆస్తి కార్డులు, టైటిల్ డీడ్‌లను జారీచేయడంతో గ్రామీణ నివాసిత(అబాది))ప్రాంతాల్లో ఆస్తిపై స్పష్టమైన యాజమాన్యాన్ని కల్పించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది.

రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



నల్లగొండలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మునిసిపల్ మాజీ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్/తిప్పర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన నల్లగొండ ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని, అలాంటిది తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇస్తోందని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పరుశురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో 39 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పరశురామ్, నాయకులు నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, రైతు సంఘం నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, బద్దం సుధీర్, పల్లపు వెంకన్న పాల్గొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం రూ.3500కోట్ల టర్నోవర్ లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ.3500కోట్ల టర్నోవర్ చేరుకోవడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో రూ.50కోట్లు పంటరుణాలు ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక రుణాలను త్వరితగతిన ఇవ్వాలన్నారు. ఈ సంవత్సరంలో నాబార్డుతో బెస్ట్ పర్ఫామెన్స్‌గా నల్లగొండ డీసీసీబీ ఎన్నిక కావడానికి సహకరించిన పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు గొంగిడి మహేందర్ రెడ్డి, గుడిపాటి సైదులు, పాశం సంపత్‌రెడ్డి, దనావత్ జయరాం, కోడి సుష్మ, కె.లింగం యాదవ్, పల్లా ప్రవీణ్ రెడ్డి, రంగాచారి, అంజయ్య, శ్రీనివాస్, సైదయ్య, జె.శ్రీనివాస్, వీరస్వామి, అరుణ, రామచంద్రయ్య, గిరిధర్, శ్రవణ్, డీసీవో పత్యానాయక్, నాబార్డు డీడీఎం వినయ్ కుమార్, డీసీసీబీ సీఈవో ఆర్.శంకర్‌రావు, జీఎం నర్మద పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్కలు నాటాలి

కేతేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): అమ్మ పేరిట ప్రతిఒక్కరూ ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని కిసాన్ మోర్చా జాతీయనేత గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల మోదీ పాలన పూర్తయిన సందర్భంగా వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. 11 ఏళ్లలో అనేక రంగాల్లో పురోగతిని సాధించి ప్రపంచంలోని అగ్రదేశాల సరసన భారత్ నిలిచిందన్నారు. దేశ ప్రతిష్ఠ విశ్వవిఖ్యాతికి ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎంఏ సత్తార్, పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు ఎ.అనితాగౌడ్, చినేని జానయ్య, సాయన్న, వేణుగోపాల్‌రెడ్డి, టి.నర్సింహాచారి, ఎన్.సంధ్య, అఖిల్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లిరెడ్డి భీమార్జున్‌రెడ్డి తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, రసాయన, జంతుశాస్త్రం, కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ, నెట్, స్లెట్ తదితర ఉన్నత విద్యార్హతలున్న అభ్యర్థులు 24వ తేదీ సాయంత్రం 4గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేములపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శెట్టిపాలెం సబ్‌స్టేషన్‌లో 33కేవీ లైన్ పనులు నిర్వహిస్తున్నందున ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులు, గృహ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నీటి వెతలు

- సదుపాయాల కల్పనలో విఫలం
- పట్టించుకోని అధికారులు
- ఇదీ త్రిపురారం ప్రభుత్వ పాఠశాల దుస్థితి



బాటిళ్లలో ఇంటినుంచి నీటిని తెచ్చుకున్న విద్యార్థులు, బకెట్ నీటితో ప్లేట్లు కడుగుతున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి,త్రిపురారం)

త్రిపురారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు తాగు, కనీస అవసరాలకు నీటి వసతి లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు నీటి ఇబ్బందులను తొలగించాలని పాఠశాల లో తొమ్మిదేళ్ల క్రితం బోరు ఏర్పాటు చేశారు. కానీ దానికి బోరు ఏర్పాటు చేయకపోవడం తో వృథాగా మారింది. నల్లాలు ఏర్పాటు చే సి నా నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇ బ్బందులు పడుతున్నారు.

ప్రాథమిక పాఠశాలలో 1-5 వ తరగతి వరకు 41 మంది విద్యార్థులు ఉన్నారు. ఇదే ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది, భవిత కేంద్రంలో 21 మంది విద్యార్థు లు విద్యనభ్యసిస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ పాఠశాలకు నీటి సరఫరా లేకుండా పోయింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసినా అవి సాయం త్రం 6 గంటలకు వస్తుండటంతో ఉపయోగం లేకుండా పోతుంది. పాఠశాల సమయం ముగిసిన తర్వాత అరకొర నీరు సరఫరా అవుతుంది. దాంతో విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయింది. భోజన సమయంలో ఒక తాగు నీటి క్యాన్ (20 లీటర్లు)తో విద్యార్థులందరూ సరిపెట్టుకోవాల్సి వస్తుంది. చాలా మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లను తీసుకొచ్చుకుంటున్నారు. భోజనం అనంతరం చిన్న బకెట్‌లో ఉన్న నీటితో ప్లేట్లు కడుక్కోవాల్సిన దుస్థితి. కనీసం బాత్ రూంకు వెళ్లడానికి నీళ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవిత కేంద్రం ఏర్పాటు చేసినా కనీస వసతులు ఏర్పా టు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఇటువంటి పరిస్థితి ఉన్నా.. అధికారులకు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నీటి సమస్యపై హెచ్ఎం వరలక్ష్మిని వివరణ కోరగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

22న నూతన రేషన్‌కార్డుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయశ్రీ

పెద్దఅడిశర్లపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఈనెల 22వ తేదీన మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే బాలునాయక్ నూతన రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తహసీల్దార్ జయశ్రీ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో కొత్తగా 1147 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, అదేవిధంగా 1979 మంది పేర్లు చేర్చామని ఆమె తెలిపారు. రేషన్ డీలర్లు తమ పరిధిలోని రేషన్ లబ్ధిదారులను సకాలంలో తీసుకువచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు రమావత్ శ్రీను, డీలర్లు, ఎం. వెంకట్‌రెడ్డి, హతీరాం, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మహేష్, ఈదయ్య, శ్రీను, రజిత, జయలాల్, ప్రతాప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

నాగార్జునసాగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఉమ తన సొంత నిధులతో ఏర్పాటుచేసిన టై, బెల్టులను ఎంఈవో రాములు విద్యార్థులకు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. అంతేకాక రూ.20 వేల వ్యయంతో డ్యూయల్ డెస్క్ బెంచీలు, ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శేషు, సీఆర్పీ రమ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చింతపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని భారతి డిగ్రీ కళాశాలలో శనివారం ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూదినమోని హన్మంతు, వైస్ ప్రిన్సిపాల్ కడారి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

నిడమనూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీహెచ్ఎస్ 24ఎంఎఫ్ రకం జొన్న పశుగ్రాసం విత్తనాలు 75శాతం సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని నిడమనూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు(ఏడీ) డాక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పశుగ్రాసం విత్తనాల అసలు ధర కిలో రూ.100 కాగా 75 శాతం సబ్సిడీ ఉన్నందున కిలో రూ.25 చొప్పున ఐదు కిలోల సంచులు రూ.125 లకు లభిస్తాయని పేర్కొన్నారు. పశువులు ఉన్న రైతులకు మాత్రమే పశుగ్రాసం విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు తీసుకువచ్చి పశుగ్రాసం విత్తనాలు పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

మిర్యాలగూడటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికార సాధన సమితి సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు తెలిపారు. పట్టణంలోని బీసీ భవన్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులతో కలిసి సమావేశ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశానికి విశారద మహారాజ్ హాజరవుతారని తెలిపారు. పార్టీలకతీతంగా బీసీ, ఎస్సీఎస్టీలు సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సాధన సమితి నాయకులు చేగొండి మురళీయాదవ్, వజ్జగిరి అంజయ్య, నీలకంఠ, ఎల్లయ్య, రాజశేఖర్, వెంకటేష్, నవీన్, రాజు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి : బీఎల్ఆర్



మార్కెట్ కార్యాలయంలో కూలీలకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పని చేస్తున్న దడవాయి, హమాలీ, మహిళా కూలీలకు ఆయన శనివారం కొత్త యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు సకాలంలో ధాన్యానికి కాంటా వేయాలని, ఎక్కువ చార్జీలు వసూలు చేసి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఇ.వెంకటేశం, కాంగ్రెస్ నాయకుడు సురేష్, అసిస్టెంట్ సెక్రటరీ బి.మధుబాబు, సూపర్‌వైజర్లు శ్రీహరి, శ్రీకాంత్, సుజాత, ఉమ, సిబ్బంది చిన్నానాయక్, పురం రవి, నాగార్జునచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

వేములపల్లి: మండలంలోని ఆమనగల్లు గ్రామంలో కొలువైన పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన పెద్ద కుమారుడు సాయిప్రసన్నరెడ్డి వివాహం కుదిరిన సందర్భంగా పెళ్లి పత్రికను దేవుడి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పిల్లల సందీప్, పుట్టల కృపయ్య, స్వరాజ్యలక్ష్మి, నగేష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి : నాగం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

దేవరకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. దేవరకొండలో శనివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ ఎన్నికల్లో అత్యధిక వార్డులు గెలవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వనం నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్‌యాదవ్, అంకూరి నర్సింహ, సముద్రాల సహదేవ్, నాగేంద్ర, శంకర్, ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొండమల్లేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తనయుడు బీఆర్ఎస్ యువనాయకుడు రమావత్ హిమవంత్‌కుమార్ అన్నారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకు పోటీలు ఎంతో కృషి చేస్తాయని అన్నారు. యువకులు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులసీరాం, రమావత్ రమేష్, వాజిద్ పాషా, లింగంయాదవ్, పంగ లాలయ్య, జహంగీర్, రావర్తి శ్రీను, యాదగిరి, పంగ రామయ్య, యాదయ్య, హరికృష్ణ, వెంకటేష్, అఫ్రోజ్, పంగ మల్లేష్, చింటూ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో గ్రామదేవతలకు పూజలు

చింతపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని కోరుతూ శనివారం చింతపల్లి మండలకేంద్రంలో గ్రామస్థులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బొడ్రాయి (నాభిశిల)తో పాటు ఈదమ్మ, ముత్యాలమ్మ, శివాలయంలో జలాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు పడాలని, పంటలు బాగా పండాలని దేవుళ్లను ప్రార్థించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎండతీవ్రత పెరుగుతుండటంతో పత్తి మొక్కలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీల అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న విజయేందర్‌రెడ్డి

హాలియా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలంలోని కొట్టాల, చల్మారెడ్డిగూడెం, హజారీగూడెం గ్రామాల్లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలమైనా ఆరు గ్యారెంటీలను అమలుచేయలేదని అన్నారు. స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా అరకొరగా విడుదల చేసిందని అన్నారు. గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని ఆరోపించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు ఉర్లగొండ వెంకటయ్య, చేగొండి కృష్ణ, వెంకటేశ్వర్లు, నర్సింహ, వీర్రాజు, శివాజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

మాడ్గులపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా రైతుల కష్టాలను తొలగిస్తామని చెప్పి రైతుల నుంచి దరఖాస్తులను తీసుకొని ఇప్పటివరకు ఒక్కటి కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పట్టించుకోకపోవడంతో రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు తంగెళ్ల నాగమణి, చింతచెర్ల శ్రీనివాస్, పిండి వెంకట్‌రెడ్డి, సబ్బు రవీందర్‌రెడ్డి, చింతచెర్ల లింగ య్య, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే రాష్ట్రాధికారం : బీజేపీ



రవికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న రాంచందర్‌రావు

మిర్యాలగూడ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే రాష్ట్రాధికారం సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రాంచందర్‌రావు అన్నారు. పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యుడు దైద రవి 150మందితో కలిసి శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన బీజేపీ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సీనియర్ నాయకులు వనం మదన్‌మోహన్, బొట్టు సోములు, నాగరాజు, గిరి, రాజశేఖర్, నాగార్జున్ పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.15.55లక్షలు

దామరచర్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఏడాది కాలానికి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోరం అమ్మకాలకు శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు దేవాలయ అనువంశిక ధర్మకర్త సిద్ధయ్య తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించడానికి నిన్నెబోయిన రాజు రూ.8,01,000 దక్కించుకోగా, లడ్డూ, పులిహోర అమ్ముకోవడానికి రూ. 4.76 లక్షలకు, వాహనాల పార్కింగ్ రుసుము రూ.90 వేలు, దేవాలయ దుకాణానికి రూ.1.88 లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. దీంతో మొత్తం సామగ్రి వేలంపై రూ.15.55లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కొబ్బరిచిప్పల సేకరణకు సరైన పాట రానందున వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.జ్యోతి, దేవాలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


డివైడర్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

దేవరకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం కొండభీమనపల్లి, విద్యానగర్‌తండా, బొల్లిగుట్టతండా ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారి రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. శనివారం ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివైడర్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది మృతి చెందుతున్నారని, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డివైడర్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొండభీమనపల్లి గ్రామానికి చెందిన ఎర్ర ఆంజనేయులు, నాగరాజు, యాదగిరి, శీను, రాములు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఎరుకల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎరుకల సమస్యలు పరిష్కరించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందర్‌నగర్‌లో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగస్టు 3వ తేదీన అట్టహాసంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానిలోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే వేడుకకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. సంఘం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పోల వెంకటేశ్వర్లు, ఉదరగిరి వెంకన్న, కంజల రవికుమార్, కంద్యాల కలీష్, వజ్జగిరి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామాల్లో కోతులు, కుక్కల బెడదను తగ్గించాలని కోరారు. మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేసి ప్ర జలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని కోరారు. పీహెచ్‌సీ, ఉపకేంద్రాల్లో వైద్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనావత్ శాంతి, జమ్ముల కోటయ్య, సుద్ధబోయిన రాములు, రవినాయక్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

చింతపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని వేణుగోపాల స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ అల్వాల జంగయ్యగౌడ్ తెలిపారు. మండలంలోని గొడకొండ్లలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మూడు రోజులుగా వర్షాలు రావాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారిని గరుడవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో గొడకొండ్ల గ్రామానికి చెందిన బాదేపల్లి శ్రీదేవినిరంజన్ దంపతులు, రిటైర్డ్ టీ చర్ వంగూర్ శ్యాంసుందర్, ధర్మకర్తలు కడారి జంగయ్య, ఇడుకుళ్ల రాంమోహన్, గ్యార ఉమాయాదయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ పెంపు

కొండమల్లేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీల కూలీ రేట్లు పెంచినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి తెలిపారు. కొండమల్లేపల్లి మార్కెట్ యార్డులో శనివారం సిమెంట్, స్టీల్ షాపుల యాజమాన్యం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో పరస్పర అంగీకారం మేరకు సిమెంట్, ఐరన్ హమాలీ రేట్లు పెంచినట్లు తెలిపారు. హమాలీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య, హమాలీ యూనియన్ అధ్యక్షుడు రమావత్ సోమ్లా, నాయకులు చందు, గన, శివ, కిషన్, బాలు, నందు, హతీరాం, రాము, శ్రీను పాల్గొన్నారు.

అధిక రుసుము వసూలు చేస్తే కఠినచర్యలు

- ఈ-జిల్లా మేనేజర్ చల్లా దుర్గారావు



ఎన్ఎస్పీ క్యాంపులోని మీ సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న చల్లా దుర్గారావు

మిర్యాలగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ-జిల్లా మేనేజర్ చల్లా దుర్గారావు హెచ్చరించారు. పట్టణంలోని 7 మీ-సేవా కేంద్రాలతో పాటు దామరచర్ల మండల కేంద్రంలో 2 కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం దుర్గారావు విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం మీ సేవా కేంద్రం నిర్వహించాలన్నారు. అధిక వసూళ్లు, నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నెస్పీ క్యాంపులోని ప్రభుత్వ ఈ సేవ కేంద్రంలో సిబ్బంది కాకుండా సేవలు అందిస్తున్న వేరే వ్యక్తిని బయటకు పంపించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్నిచోట్ల నిబంధనల మేరకే సేవలందిస్తున్నట్లు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్‌కు ఎన్‌వోసీ తీసుకోవాలి

- సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేసేందుకు సంబంధితశాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ బలరాంను సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్ ఆదేశించారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు భద్రపరిచే గదిని, రికార్డులను పరిశీలించారు. భూముల రిజిస్ట్రేషన్ తీరును, ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ట్యాక్స్ రశీదుల పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసే విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్పించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యాలయంపై అంతస్థులో ఉండటంతో రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చే వారికి అసౌకర్యం కలుగుతోందని, వయసుపై బడిన వారు మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదుల మేరకు అన్ని వసతులు కలిగిన నూతన భవనంలోకి కార్యాలయాన్ని మార్చే అవకాశాన్ని పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్